Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 112 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 6 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం.. రైలు ఢీకొని ఆరుగురు మృతి



**ఉత్తరప్రదేశ్:** మిర్జాపూర్ చునార్ జంక్షన్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రైల్వే పట్టాలు దాటుతున్న కొందరి ప్రయాణికులను వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. మృతులు గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి చోపాన్ ప్రాంతం నుంచి వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. వారు ప్యాసింజర్ రైలులో చునార్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని పట్టాలు దాటుతుండగా వారిని రైలు ఢీకొట్టి నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికార యంత్రాంగాన్ని సీఎం యోగి ఆదేశించారు.

## జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఏపీ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో అమరావతి సచివాలయంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రుల బృందం బుధవారం సమావేశమైంది. ఈ భేటీకి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి, వంగలపూడి అనిత పాల్గొన్నారు. వర్చువల్‌గా మంత్రి నారాయణ, సత్యకుమార్ యాదవ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడంపై మంత్రులు మాట్లాడుతున్నారు. జిల్లాల విభజన వల్ల ఉన్న ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు జీవోఎం ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే జీఎంవో ప్రాథమికంగా ఇచ్చిన నివేదికపై కొన్ని మార్గదర్శకాలు సీఎం చంద్రబాబు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలాలు, పంచాతీయలు విభజన చేయకుండా నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని ఇప్పటికే జీఎంవో నిర్ణయించింది. ఈరోజు మంత్రుల బృందం సమావేశమై తుది నివేదికను రూపొందించి సీఎం చంద్రబాబుకు మంత్రివర్గ ఉప సంఘం అందజేయనుంది. కేంద్ర ప్రభుత్వం చేయబోయే జనగణనకు ముందే నివేదిక ఇచ్చేందుకు జీవోఎం ప్రయత్నిస్తోంది. ఈ నెల 10వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై కీలక చర్చలు జరిపి మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులకు ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి.

## విజయవాడలో చేనేత వస్త్ర ప్రదర్శన 'వసంతం-2025'ను ప్రారంభించిన మంత్రి లోకేష్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** విజయవాడ ఎంజీ రోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ వేదికలో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'వసంతం-2025' చేనేత వస్త్ర ఎగ్జిబిషన్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 'వసంతం-2025' పేరుతో రెండు రోజుల వార్షిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ లో వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత, చేతివృత్తుల కార్మికులు తయారుచేసిన వివిధ ఉత్పత్తులను 70కిపైగా స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. ఆయా స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి సహజసిద్ధ రంగులతో తయారుచేసిన 'కొత్తూరు వసంత వర్ణ' నూతన చేనేత బ్రాండ్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా



సెక్రటరీ ఎస్.రంజన, ఇతర ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సుజాత, సౌభాగ్యలక్ష్మి, పద్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## నో పోలీసు, నో పార్టీ.. ఓన్లీ పబ్లిక్.. ఎమ్మెల్యే ఒంటరి పర్యటన

**కృష్ణా, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పెనమలూరు నియోజకవర్గంలో ఒంటరిగా పర్యటన చేపట్టారు. సమస్యలను ఒక్కరోజులో పరిష్కరించలేనని.. తనకున్న సమయంలో పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే చెబుతున్నారు. నో పోలీసు....నో పార్టీ....ఓన్లీ పబ్లిక్ అంటూ ఎమ్మెల్యే ఒక్కరే పర్యటన సాగించారు. బుధవారం కంకిపాడులో బుల్లెట్‌పై పర్యటించిన ఎమ్మెల్యే.. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ప్రధానంగా రోడ్, డ్రైనేజ్ సమస్యను పరిష్కరిం చాలని బోడె ప్రసాద్‌కు ప్రజలు విజ్ఞప్తి చేశారు. అలాగే గత ప్రభుత్వం పెన్షన్ ఆపేసిందంటూ ఒకరిద్దరు ఫిర్యాదు చేశారు. ప్రజల సమస్యలు విన్న బోడె ప్రసాద్... అన్ని సమస్యలు ఒక్కసారి పరిష్కరించటం సాధ్యం కాదని స్పష్టం చేశారు. తనకు ఉన్న సమయంలో సమస్యలు అన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే మండల కేంద్రమైన కంకిపాడులో రూ. 2 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రైన్ నిర్మాణంతో పాటు ప్రణాళికబద్ధంగా గ్రామాభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చామని తెలిపారు. పలువురు స్థానికులు తనతో



మాట్లాడారని... ఎమ్మెల్యే రావడం తమకు ఆనందంగా ఉందన్నారని తెలిపారు. గత ఐదేళ్లు వైసీపీ ఏమి చేయలేదని తమను మోసం చేసిందని వాపోయారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు చెప్పకుండానే ఎమ్మెల్యే ఈ పర్యటన చేశారు. పార్టీ నాయకులు ఉంటే ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వీలు పడదని... అందుకే ఈ ఒంటరి పర్యటన అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చెప్పుకొచ్చారు.

## విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎన్నారైల భాగస్వామ్యాన్ని పెంపొందించాలి : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### - ఎగుమతులు, దిగుమతులపై ఎన్నారైలలో అవగాహన పెంచే చర్యలు చేపట్టాలి - ఏపీఎన్నార్టీ ఐకానిక్ టవర్ నిర్మాణ పురోగతిపై మంత్రి సమీక్ష



**అమరావతి, (రాజధాని వార్తలు):** వివిధ దేశాల్లో కీలక స్థానాల్లో పని చేస్తున్న ఎన్నారైలతో ఓ క్లబ్ ఏర్పాటు చేసి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అన్ని అవకాశాలను వారికి వివరించి, వారి ద్వారా పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. విదేశాల్లో స్థిరపడిన పారిశ్రామిక వేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే విధంగా ప్రోత్సహించాలని, పారిశ్రామిక విధానాన్ని వారికి అర్ధమయ్యే విధంగా, ప్రభుత్వం అమలు చేసే వివిధ కార్యక్రమాలను వారికి వివరిస్తూ, పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను ఎన్నారై క్లబ్ ద్వారా నిర్వహించాలని మంత్రి సూచించారు. విదేశీ సంస్థలలో కీలక స్థానాలలో పనిచేసే ముఖ్య కార్యనిర్వహణాధికారులు, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్లను ఈ క్లబ్‌లో భాగస్వాములను చేయాలని తెలిపారు. ఇదే సమయంలో ఏపీ ఎన్నార్టీ అధ్యక్షుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఈ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి పేర్కొన్నారు. అదే విధంగా ఎగుమతిదారులు, దిగుమతిదారులతో సైతం ఓ క్లబ్ ఏర్పాటు చేసి, ఎగుమతిదారులు అందరినీ ఓ గొడుగు కింద, అలాగే దిగుమతిదారులను ఓ గొడుకు కిందకు తీసుకువచ్చి, ఎగుమతులు, దిగుమతులలో ఉన్న మెళుకువలను తెలియజేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎగుమతులను ప్రోత్సహించాలని మంత్రి పలు సూచనలు చేసారు. 135 దేశాల్లో ఉన్న తెలుగువారికి ఎగుమతులు, దిగుమతులపై స్పష్టమైన అవగాహన పెంపొందించడం ద్వారా, రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే వివిధ రంగాల్లోని వస్తువులను డిమాండ్ పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. అమరావతిలో నిర్మించ తలపెట్టిన ప్రవాసాంధ్రుల ఐకానిక్ టవర్ నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్నార్టీ అధ్యక్షులు వేమూరి రవి కుమార్, సీఈఓ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## తొమ్మిది రోజుల తర్వాత పరామర్శలా... జగన్‌పై కొల్లు రవీంద్ర సీరియస్

**కృష్ణా, (రాజధాని వార్తలు):** మాజీ సీఎం వైఎస్ జగన్ కృష్ణా జిల్లా పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పర్యటనలో ఎక్కడా కూడా రైతులు కనిపించలేదన్నారు. తాను పర్యటి స్తున్న ప్రాంతాల్లో రైతులు లేక పక్క గ్రామాల నుంచి రైతులను తెప్పించుకుని జగన్ పబ్లిసిటీ స్టంట్లు చేశారని విమర్శించారు. పొలం గట్ల మీద నడిచి ఫోటోలకు స్టిల్స్ ఇచ్చారని కామెంట్స్ చేశారు. తుఫాను తీరం దాటిన తొమ్మిది రోజుల తర్వాత పరామర్శ పేరుతో జగన్ రాజకీయ డ్రామా సృష్టించారని వ్యాఖ్యలు చేశారు. జగన్ పర్యటన ఆద్యంతం పచ్చి అబద్ధాలతో సాగిందని ఆరోపించారు. జగన్ మాట్లాడిన మాటల్లో ఒక్క నిజం కూడా లేదని... కేవలం ప్రభుత్వం మీద బురద జల్లేందుకే జగన్ ప్రయత్నించారని మండిపడ్డారు. జగన్ దిగిన పొలాల్లో ఎక్కడా కూడా వర్షపు నీరు నిలిచి లేదని అన్నారు. పంట కాలువలను బాగు చేయడం వల్లే పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు ఎప్పటికప్పుడు కాలువల గుండా వెళ్లిపోయిందన్నారు. ఫలితంగా రైతులు చాలా వరకు నష్టపోకుండా చూడగలిగామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కాలువల్లో మట్టి కూడా తీయలేదని విమర్శించారు. చంద్రబాబు, లోకేష్‌లపై విమర్శలు చేసే అర్హత జగన్‌కు లేదన్నారు. తల్లిని చెల్లిని పట్టించుకోని వ్యక్తి జగన్.. చంద్రబాబుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్‌టీజీఎస్ నుంచి తుఫాను సహాయ చర్యలపై చంద్రబాబు,



లోకేష్ నిరంతరం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని తెలిపారు. తుఫాను తీరం దాటిన మరుసటి రోజే ఏరియల్ సర్వే ద్వారా పంట నష్టాన్ని సీఎం చంద్రబాబు చూశారన్నారు. ఆ మరుసటి రోజే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్షేత్ర పర్యటన చేసి పంట నష్టం అంచనాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.82 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు ప్రాథ మిక అంచనాలు తయారు చేశామన్నారు. పంట నష్టం నమోదుపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి చెప్పారు. ప్రాణ నష్టం లేకుండా ప్రభుత్వ యంత్రాంగం విశేషంగా కృషి చేసిందని అన్నారు. తుఫాను సమయంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు బాధ్యతాహితంగా పని చేశారని అభినందించారు. పనిచేసే అధికారులను అవమానపర్చే విధంగా జగన్ మాట్లాడిన తీరు గర్హనీయమని మండిపడ్డారు. ఐదేళ్లలో వైసీపీ చేసిన ధర స్థిరీకరణ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో క్రాప్ హాలిడే ప్రకటించిన రోజులను జగన్ ఒకసారి గుర్తు తెచ్చుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## "జర్నలిజంలో డిప్లమో కోర్సు" సప్లిమెంటరీ పరీక్షల్లో 14 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత

**అమరావతి, (రాజధాని వార్తలు):** సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన "జర్నలిజంలో డిప్లమో కోర్సు" సప్లిమెంటరీ పరీక్షల్లో 14 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారని మీడియా అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆగస్టు నెలలో నిర్వహించిన ఈ పరీక్షలకు గతంలో ఉత్తీర్ణులు కానీ 50 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 28 మంది పరీక్షలకు హాజరు కాలేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలకు హాజరైన వారిలో 8 మంది ఉత్తీర్ణులు కాలేదని ఆ ప్రకటనలో తెలిపారు.

ఫలితాలు నాగార్జున యూనివర్సిటీ వెబ్ సైట్‌లో "రిజల్ట్స్"లో అభ్యర్థులు తమ రిజిస్టర్ నెంబరును ఎంటర్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అభినందలు తెలిపారు.

# యస్ ఆర్ యం యూనివర్సిటీ, అమరావతిలో కల్తీ ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థినీ విద్యార్థులు

**- సుమారు 300 మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు - రెండు హాస్టళ్లలోని విద్యార్థులు అస్వస్థత - ఓపెన్ హౌస్‌లో హాస్టల్ విద్యార్థులు ఈ విషయాన్ని తెలిపారు - ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి**




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఈ నెల నవంబర్ 3, 2025 న యస్‌ఆర్‌యం యూనివర్సిటీ అమరావతి హాస్టల్‌లోని విద్యార్థులు కల్తీ ఆహరం తిని అస్వస్థకు గురయ్యారు. ఆదివారం ఇచ్చిన నాన్‌వెజ్ భోజనమే కారణమేమోనని వాపోతున్నారు. విద్యార్థులు ప్రశ్నించగా వారిని ప్రత్యేక గదులకు తీసుకెళ్లి వేరుగా చికిత్స అందించి గుమ్మనంగా సర్ది చెప్తున్నారన్నారు. ఒక విద్యార్థికి గడువు ముగిసిన మందులు ఇవ్వడం అత్యంత బాధాకరమని చెప్తున్నారు. యూనివర్సిటీలోని డిఎస్సీ (ఇన్‌హౌస్ కమిటీ) సభ్యులు, హాస్టల్ విద్యార్థులు ఆహారం గురించి ప్రశ్నించగా "మీకు ప్రశ్నించే హక్కు ఎవరు ఇచ్చారు?" అని ప్రతిగా అడిగారని సమాచారం. కొంతమంది విద్యార్థులు, ముఖ్యంగా విజయవాడ వంటి సమీప ప్రాంతాల వారు, ఇళ్లకు వెళ్లిపోయారని సమాచారం. ప్రస్తునానికి యూనివర్సిటీ ఈమెయిల్ ద్వారా చికెన్, గుడ్లను మెనూ నుంచి తొలగించింది. ఆహార భద్రత అధికారులను కూడా ప్రభావితం చేసినట్లు తెలుస్తోంది. అందుకే ప్రభుత్వానికి ఈ విషయం సక్రమంగా తెలియలేదని విద్యార్థులు అంటున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు క్యాంపస్‌లో కేవలం 10 నిమిషాలపాటు మాత్రమే ఉన్నారని, తాత్కాలికంగా ఒకటి లేదా రెండు వారాల పాటు నాన్‌వెజ్ భోజనాన్ని నిలిపివేయాలని సూచించి వెళ్లిపోయారని సమాచారం. ఒక విద్యార్థి వ్యాఖ్యానిస్తూ, "ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సింది కానీ దురదృష్టవశాత్తూ అలాంటి బాధ్యత కనిపించలేదు!" అంతేకాదు, యూనివర్సిటీ డాక్టర్ అవసరమైనప్పుడు అందుబాటులో లేరని, కేవలం కంపౌండర్లు మాత్రమే ఉన్నారని విద్యార్థులు తెలిపారు. డాక్టర్‌లు కేవలం మెడికల్ సర్టిఫికెట్లు అవసరమైనప్పుడు మాత్రమే వస్తారని కూడా విద్యార్థులు చెబుతున్నారు. ఇది ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఏపీ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని హాస్టల్ విద్యార్థులు పేర్కొన్నారు. ఒక బీటెక్ హాస్టల్ విద్యార్థి వ్యాఖ్యానిస్తూ, "విద్యార్థి కమిటీ కేవలం పేరుకే ఉందిబీ మా సూచనలు ఎవరూ పరిగణనలోకి తీసుకోరు. వాళ్లు కావాలనుకున్న ఆహారమే ఇస్తారు." ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని ఈ యూనివర్సిటీలో జరిగిన ఈ ఘటనలో, 300 మంది విద్యార్థులు కల్తీ ఆహరం తిని విద్యార్థినీ విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు. కొంతమంది విద్యార్థులు యూనివర్సిటీ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఏపీ విద్యార్థుల హాస్టళ్లలో సరైన ఆహార ప్రమాణాలు పాటించాలి, విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.


# ప్రపంచ సామాజిక ఆవిష్కరణ దినోత్సవం 2025




**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రపంచ వ్యాప్తంగా సామాజిక మార్పు, న్యాయం మరియు స్థిరమైన అభివృద్ధికి కృషి చేస్తున్న ఆవిష్కర్తల కృషిని గుర్తించేందుకు నవంబర్ 8న "గ్లోబల్ సోషల్ ఇన్నోవేషన్ డే 2025" ("అంతర్జాతీయ సామాజిక ఆవిష్కరణ దినోత్సవం") దేశవ్యాప్తంగా జరుపుకోనున్నట్లు ప్రముఖ న్యాయ వాది, మానవ హక్కుల కార్యకర్త ఎలమందల శ్రీనివాస రావు అన్నారు. బుధవారం విజయవాడలోని గాంధీనగర్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్లో "గ్లోబల్ సోషల్ ఇన్నోవేషన్ డే 2025" ("అంతర్జాతీయ సామాజిక ఆవిష్కరణ దినోత్సవం") సందర్భంగా హెల్ప్ సంస్థ మరియు క్యాటలిస్ట్ నౌ ఆంధ్రప్రదేశ్ చాప్టెర్ సంయుక్తంగా ఒక సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం ఈ రోజు నుంచి 9వ తేదీ వరకు జరుపుకోనున్నట్లు తెల్పుతూ ఈ కార్యక్రమం ద్వారా సామాజిక ఆవిష్కరణల ప్రాధాన్యాన్ని ప్రోత్సహించడం, వాతావరణ మార్పు, నీటి వనరులు, విద్యా అవకాశాలు, సామాజిక న్యాయం వంటి రంగాల్లో మార్పు తీసుకొస్తున్న నాయకులను ముక్యంగా కమ్యూనిటీ స్థాయి నుంచి నాయకులను కూడా గుర్తించడం ప్రధాన లక్ష్యం అన్నారు. క్యాటలిస్ట్ నౌ ఇండియా చాప్టర్ ఈ ఏడాది ప్రత్యేకంగా దేశవ్యాప్తంగా ఉన్న సామాజిక ఆవిష్కర్తలను కలిపే ప్రచారాన్ని ప్రారంభిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా స్థానికంగా ఉన్న వివిధ సామాజిక సమస్యలపై స్పందించి మార్పు తీసుకొస్తున్న వ్యక్తుల కథలను సోషల్ మీడియా ద్వారా ప్రజలతో పంచుకుంటారు. ఈ నవంబర్ నెలంతా ఈ కథలు ఆన్‌లైన్‌లో ప్రచారం చేయనున్నారు. క్యాటలిస్ట్ 2030 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధి మరియు హెల్ప్ సంస్థ కార్యదర్శి రామమోహన్ నిమ్మరాజు మాట్లాడుతూ, క్యాటలిస్ట్ 2030 అనేది ప్రపంచవ్యాప్తంగా తమ తమ ప్రాంతాల్లో స్థానికంగా గుర్తించిన సామాజిక సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్న లేదా అలాంటి సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు సహాయ సహకారాలను అందిస్తున్న చిన్న చిన్న వ్యాపారులు, ఆవిష్కర్తలు, మరియు సమాజ నాయకుల సమూహం. "క్యాటలిస్ట్ 2030 ఒక ఉద్యమంగా మొదలై ఇప్పుడు సామాజిక ఆవిష్కరణ రంగంలో ఒక శక్తిగా మారిందన్నారు. వీరి లక్ష్యం సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ సాధనకు ప్రజా కేంద్రిత, సమాజ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడం. ప్రభుత్వాలు, వ్యాపారాలు, సమాజాలతో కలిసి వ్యవస్థాత్మక మార్పు సాధించడమే వీరి సంకల్పం. ఈ "గ్లోబల్ సోషల్ ఇన్నోవేషన్ డే" ("అంతర్జాతీయ సామాజిక ఆవిష్కరణ దినోత్సవం") ద్వారా సామాజిక ఆవిష్కరణ రంగంలోని వ్యక్తుల సమూహాన్ని గౌరవించేందుకు ప్రారంభించబడింది. విముక్తి రాష్ట్ర నాయకురాలు లక్ష్మీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మనం మన కమ్యూనిటీని గౌరవించుకొందాం. మీరు నమ్మే మార్పుకు కారణమైన వ్యక్తులను, ఆ మార్పు కోసం వారు చేపట్టిన కార్యక్రమాన్ని ట్యాగ్ చేసి, ఫార్వర్డ్' చేయండని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రభుత్వాలు, స్థానిక వ్యాపారులు, అందరు కలిసినప్పుడు వ్యవస్థాత్మక మార్పు సాధ్యమవుతుంది" అని అన్నారు. ఈ దినోత్సవం సామాజిక ఆవిష్కరణ సమాజానికి ఒక వేదిక. మీ సమాజంలోని మార్పుకు కృషి చేసిన లేదా సహకరించిన సాధకులను సోషల్ మీడియాలో ట్యాగ్ చేసి, వారి కథలు, చిత్రాలు, వీడియోలను పంచుకోండన్నారు. ప్రభుత్వ అధికారులు, నాయకులు, గ్రామ లేదా జిల్లా స్థాయి సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు లేదా యువత ఎవరిదైనా ఏ విధమైన సామాజిక మార్పుకు తోడ్పాటునిస్తే, లేదా సహకరించినా కూడా వారి కృషిని ప్రోత్సహించండి. ఈ కథలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యక్తులు, బృందాలకు ప్రేరణనిస్తాయని మేము ఆశిస్తున్నాం. ప్రముఖ వ్యాపార వేత్త శ్రీ కృష్ణా రావు మాట్లాడుతు స్థానిక సమాజంలోని చిన్న చిన్న వ్యాపారులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రజలు పరిష్కారాలను అభివృద్ధి చేస్తే, వారికి స్వతంత్రభావం మరియు గొప్పదనం వస్తుంది. ఇది బాధ్యతాయుత పౌరులను తయారు చేస్తుంది, వారు తమ సమాజంలోని సమస్యలను మాత్రమే కాకుండా, ఇతర సమస్యల పరిష్కారాలకూ మార్గదర్శకులుగా మారతారు. దీని ద్వారా సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ సాధించడంలో సహకారం లభిస్తుందన్నారు. స్థానికంగా ఉన్న సమాజంలోని వ్యాపారులు చిన్న స్థాయిలో ప్రారంభిస్తారు, ఎందుకంటే వారు తమ సమాజంలో ఉన్న ఒక సమస్యను పరిష్కరిస్తున్నారు. వారు ఆలోచనాత్మకంగా, ప్రయోగాల ద్వారా, స్థిరమైన మరియు మూల కారణాలను పరిష్కరించే వ్యూహాలను అభివృద్ధి చేస్తారు. ఇది వ్యవస్థాత్మక మార్పుకు దారి తీస్తుంది. ఈ దినోత్సవంలో భాగంగా పౌరులు, యువత, ప్రభుత్వ ప్రతినిధులు మరియు సామాజిక నాయకులు తమ సమాజంలోని సామాజిక మార్పు సాధకుల కథలను సోషల్ మీడియాలో పంచుకోవాలని క్యాటలిస్ట్ నౌ ఇండియా మరియు ఆంధ్ర ప్రదేశ్ విభాగం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో విజయవాడ పట్టణంలోని ప్రముఖ వ్యాపార వేత్తలు, సమాజ సేవకులు, హెల్ప్ ప్రోగ్రాం మేనేజర్ పవన్ కుమార్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వి.భాస్కర రావు పాల్గొన్నారు.

# పీఎంజేవీకే పనుల కోసం రూ.203.69 కోట్లు విడుదల

**- రాష్ట్రంలో మైనారిటీల వికాసానికి "జన్ వికాస్" ద్వారా విస్తృత మౌలిక వసతులు - చంద్రబాబు నాయకత్వంలో కేంద్ర పథకాల సమర్ధ వినియోగం : రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ప్రధానమంత్రి జన్ వికాస కార్యక్రమం (పీఎంజేవీకే) ద్వారా మైనారిటీల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పనుల కోసం రూ.203.69 కోట్లు మొత్తాన్ని కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర బడ్జెట్ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మైనారిటీ సంక్షేమం కోసం కేటాయించిన బడ్జెట్ లో పీఎంజేవీకే కింద రూపొందించిన పనులు, అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక తోడ్పాటు, తదితర వాటి పూర్తికి రూ. 203.69 కోట్లు మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసిందని మంత్రి పేర్కొన్నారు. మైనారిటీలు ఎక్కువగా ఉండే ప్రాంతాల అభివృద్ధి, సమస్యలను పరిష్కరించడానికి కేంద్రం నేతృత్వంలో, రాష్ట్రాల భాగస్వామ్యంతో పీఎంజేవీకే పథకాన్ని అత్యంత పటిష్టంగా, పారదర్శకంగా అమలు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, కేంద్ర మైనారిటీ పథకాలను కూడా సమర్ధవంతంగా వినియోగించుకోవడం ద్వారా మైనారిటీ వర్గాల సంక్షేమానికి కార్యాచరణ బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. కేంద్రం నిధులను సమర్ధవంతంగా వినియోగించుకునేందుకు సమన్వయంతో ముందుకు సాగడంలో భాగంగానే 2025-2026 ఆర్థిక సంవత్సరంలో పీఎంజేవీకే పనుల కోసం నిధులు విడుదల చేయడంతో విస్తృత మౌలిక వసతుల కల్పనకు అవకాశం కలుగుతుందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.

## విద్యార్థుల బృందానికి అభినందనలు : నారా లోకేష్




**అమరావతి, (రాజధాని వార్తలు):** న్యూఢిల్లీలో నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం, రష్యా సైన్స్ అండ్ కల్చరల్ సెంటర్ సందర్శనకు బయలుదేరిన మన విద్యార్థుల బృందానికి అభినందనలు. రెండు రోజుల ఈ టూర్ ద్వారా ప్రాక్టికల్‌గా విద్యార్థుల్లో సైన్స్ & టెక్నాలజీపై అవగాహన పెరుగుతుంది. క్షేమంగా వెళ్లి విజ్ఞానంతో తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్.



**రాజధాని అమరావతిలో విస్తృతంగా పర్యటించిన అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవ తేజ ఐఏఎస్, అమరావతిలో ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలకై నిర్మిస్తున్న బంగ్లాల నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించిన అడిషనల్ కమిషనర్**

# విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : ముఖేష్ కుమార్ మీనా

**- అమరావతిలో అబ్కారీ శాఖపై రాష్ట్ర స్థాయి సమీక్ష**

**- అక్రమార్జనకు పాల్పడితే తీవ్ర పరిణామాలు**




**అమరావతి, (రాజధాని వార్తలు):** విధి నిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శించే వారిపై కఠిన చర్యలకు వెనుకాడబోమని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (సాధారణ పరిపాలన - రాజకీయం, అబ్కారీ, గనులు) ముఖేష్ కుమార్ మీనా హెచ్చరించారు. ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. మంగళగిరి ఆబ్కారీ కమీషనర్ కార్యాలయంలో బుధవారం ఆయా జిల్లాల ఆబ్కారీ అధికారులు, అసిస్టెంట్, డిప్యూటీ కమిషనర్లతో రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ములకల చెరువు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. నేరం జరిగిన సందర్భంలో పాటించాల్సిన సాధారణ ప్రోటోకాల్‌ను అనుసరించకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపై రాష్ట్ర స్థాయిలో అబ్కారీ కమీషనర్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్‌లు 15 రోజులకు ఒకసారి, ముఖ్య కార్యదర్శిగా తాను నెలకు ఒకసారి అన్ని విషయాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఆబ్కారీ శాఖలో వ్యవస్థీకృత అవినీతి అంటూ పత్రికలలో కథనాలు వస్తున్నాయని, ఏ ఒక్కరు అక్రమార్జనకు పాల్పడినా తీవ్ర పరిణామాలు ఎదుర్కొవలసి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వ్యవహారాలలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారని చెప్పారు. అబ్కారీ శాఖ అధికారులు అన్ని వ్యవహారాలలో సూక్ష్మ స్థాయి పరిశీలన అలవరుచుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో చేస్తున్న సమీక్షలు సర్కిల్ స్థాయిలో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కమీషనర్‌ను ఆదేశించారు. అధికారులు సాధారణ వివరణలు ఇవ్వటం మానుకోవాలన్నారు. స్పష్టతతో కూడిన సమాధానాలను మాత్రమే ఇకపై ఆశిస్తానని హితవు పలికారు. పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని అధికారుల పనితీరు సక్రమంగా లేకపోవటం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇదే తీరుగా ఉన్న మరో నాలుగు జిల్లాల అధికారులను సైతం మందలించారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలని కోరారు. అబ్కారీ శాఖ సంచాలకులు చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ వాస్తవ ఉత్పత్తి సామర్థ్యం, కల్లు విక్రయాల పరిణామంలను తరచూ గమనిస్తూ ఉండడం తప్పనిసరన్నారు. రానున్న రెండు రోజుల్లో ఈ అంశంపై జిల్లాస్థాయిలో పూర్తి డేటాతో నివేదిక కావాలన్నారు. వివిధ స్థాయిలలో ఉన్న క్రమశిక్షణ కేసుల పరంగా నిబంధనల మేరకు విచారణ జరిపి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజు బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ రాష్టంలో విక్రయించే ప్రతి మద్యం సీసా తప్పనిసరిగా సురక్షా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. నవోదయం 2.0 అమలుకు సంబంధించి శ్రీకాకుళం, మన్యం జిల్లాలో కొంత బాధ్యతారాహిత్యం కనిపిస్తుందన్నారు. సుంకం చెల్లించని మద్యం, నాటుసారా, నకిలీ మద్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కమీషనర్ దేవ కుమార్, సంయుక్త కమిషనర్లు అనుసూయ దేవి, నాగలక్ష్మి, అరుణ రావు, ఓఎస్డీ చంద్రశేఖర నాయుడు, పూర్వపు జిల్లాల ఉప, సహాయ కమిషనర్లు, జిల్లా అబ్కారీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్లపైకి వస్తాం మా గొంతులు కోసేయండి

## - అప్పుడైనా మా జాతులు మేల్కొని చైతన్యవంతులవుతాయి - నేరం చేసిన హంతకులు దర్జాగా, హ్యాపీగా బయట తిరుగుతున్నారు - జిల్లా ఎస్పీకి రెండు చేతులు జోడించి అడుగుతున్నాం.. శాంతి భద్రతలు లోపించకుండా చూడండి - చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే శాంతియుతమైన ప్రదర్శనలు చేస్తాం.. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు కూడా చేపడతాం - గిరిజన నాయకుడు గోపాల్‌కు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తాం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇస్కపాలెం సర్పంచ్ అడపాల ఏడుకొండలు, కసుమూరు సర్పంచ్ కడివేటి శివ, ఎస్సీ, ఎస్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు

స్క్రోలింగ్ పాయింట్స్

వెంకటాచలంలో గత రెండు రోజుల కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బదనాపురి గోపాల్ పై కొంతమంది తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వ్యక్తులు దాడి చేయడం అనేది ఎంతో దుర్మార్గం. ఈ ఘటనను ఎస్సీ సర్పంచులు, ఎస్టి ప్రజాప్రతినిధులు అందరం తీవ్రంగా ఖండిస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ కాలనీలలో శాంతి భద్రతలు లోపించాయి. వర్గాల వారిగా రెచ్చగొట్టి తమ జీవితాల్లో విషాదలు నింపి మరణకాండ సృష్టిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీలు అంటే ఎందుకు అంత చిన్న చూపు. ఎస్సీ, ఎస్టీ ప్రజలు, మేధావులు ఒక్కసారి ఆలోచించాలి. అతి చిన్న వయసులో ఎస్టీ సెల్ విభాగానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన బదనాపురి గోపాల్ ప్రెస్ మీట్ పెట్టి విమర్శించాడన్న అక్కసుతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. గొంతు కోసి చంపాలనుకోవడం హేమమైన చర్య. ఎస్సీ, ఎస్టీ ప్రజలందరూ ఆలోచించుకోవాలి. ఈరోజు గోపాల్‌కి జరిగింది. లేకపోతే ఇంకొకడికి జరిగేది అనుకుంటే కాదు.. ఈ దుర్మార్గులు ఎస్సీ, ఎస్టీలకు బ్రతకనిస్తారా. కూటమి నేతలకు ఏమైనా ఎస్సీ, ఎస్టీలు బానిసల్లాగా బ్రతకాలా. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి లోకేష్ బాబు రాసిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసే పని అయితే పోలీసులు శ్రమ పడబడలేదు.. రోజుకి ఒకరిని పిలవండి మేమే వస్తాం నడిరోడ్డు పై మా గొంతులు కోసేయండి. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగితే ఇంతవరకు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియని పరిస్థితి. పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటే సంతోషం. నేరానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే రెండు రోజుల తర్వాత భవిష్యత్తు కార్యచరణ సిద్ధం చేసుకుంటాం. గొంతులు కోసే సంస్కృతి బాగా నచ్చితే రాత్రికి నా గొంతు కోసేయండి. నిన్న గోపాల్ గొంతు కోశారు. ఈరోజు రాత్రికి నా గొంతు కోయండి.. రేపు రాత్రికి కసుమూరు సర్పంచ్ కడివేటి శివ గొంతును కోయండి. గొంతులు కోసే సంస్కృతి కూటమి నేతలకు బాగా నచ్చితే దళితులు, యానాదులు, ఎరుకల ఇలా రోజు ఒకరి గొంతు కోసుకుంటూ పోండి. ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఎంతోమందిని బలి తీసుకునే ఆలోచనలో ఈ దుర్మార్గులు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారిని మేము ఎలా రక్షించుకోవాలో మాకు బాగా తెలుసు. ఇంత భయంకరమైన ఘటన జరిగితే స్థానిక శాసనసభ్యుడికి తెలియకుండా ఉందా. ఇప్పటివరకు ఎందుకు వివరణ ఇవ్వలేదు. స్థానిక శాసనసభ్యుడికి ఎస్సీ, ఎస్టీలు అంటే చిన్న చూపే. గొంతులు కోసిన, ప్రాణాలు తీసిన ఎస్సీ, ఎస్టీలు ఏం చేస్తారులే అన్న ధీమాతో ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలు రాజకీయంగా ఎదగడం కూటమి నేతలకు ఇష్టం లేదని మాకు అర్థమవుతుంది. నా చిన్నతనంలో నాటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో కారంచేదులో జరిగిన ఘోరమైన ఘటనను చూసాం. ఉద్యమ బాటలో కూడా నడిచాం. అప్పట్లో మా హక్కులను సాధించుకుని. న్యాయం చేకూర్చుకున్నాం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తమకు రాజకీయంగా అవకాశం ఇస్తే రాజకీయంగా ముందుకు పోయామే కానీ రౌడిల్లా మారలేదు. మా కోసం త్యాగం చేసినటువంటి నాయకులంతా హింస మార్గాన్ని వదిలి అహింస మార్గంలో నడవండి.. మీ జీవితాలు మార్చుకోండి అని చెప్పారు. అందరం కష్టపడి చదువుకొని ఉన్నతమైన మార్గంలో నడుస్తుంటే నోరులేని ఒక ఎస్టి కులానికి చెందిన రాష్ట్ర స్థాయి నాయకుడు పైన అర్ధరాత్రి కత్తులతో దాడి చేసి గొంతు కోశారు. ఇదేనా భారతదేశానికి స్వతంత్రం తెచ్చిన గాంధీజీ కలలు కన్నా స్వతంత్రం. ఆడవారు స్వేచ్ఛగా తిరిగిన రోజే భారతదేశానికి నిజమైన స్వతంత్రమన్నారు గాంధీ మహాత్ముడు. అర్ధరాత్రి ఒక మగ యువకుడు ఇంట్లో నిద్రపోతుంటే ఏం జరిగింది వాళ్లపైన ఏం చర్యలు తీసుకున్నారు. ఎలాంటి చర్యలు తీసుకున్నారు. ఇంతవరకు బయటకు రాలేదు. నేరం చేసిన హంతకులు ఏమాత్రం భయం లేకుండా స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. ఎస్పీకి చేతులు రెండు జోడించి అడుగుతున్నాం. నేరానికి పాల్పడిన హంతకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని గోపాల్ కు న్యాయం చేయండి.

# ప్రశాంత చిత్తం సుషుమ్న క్రియాయోగతో సాధ్యం










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని వి.పి.ఆర్. కన్వెన్షన్ సెంటర్ ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. పూజ్య గురుమాత ఆత్మానందమయి నిర్వహించిన సుషుమ్న క్రియా యోగ ధ్యాన దీక్షా కార్యక్రమంలో వేలాది మంది భక్తులు, సాధకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పలు ప్రముఖులు విచ్చేశారు. భారతదేశమే కాదు విదేశాల నుండి కూడా అనేక ఆధ్యాత్మిక సాధకులు హాజరై ధ్యానంలో పాల్గొన్నారు. పవిత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించబడిన ఈ దీక్షా కార్యక్రమం, గురు భోగ సిద్ధర్, మహావతార్ బాబాజీ మరియు పూజ్య గురుమాత ఆత్మానందమయి అమ్మగారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఆధ్యాత్మిక వేడుకగా నిలిచింది. సంగీతం, ధ్యానం మరియు ప్రముఖుల సందేశాలతో కార్యక్రమం ఎంతో అద్భుతంగా సాగింది. ఆత్మానందమయి అమ్మగారి ద్వారా నిర్దేశించబడిన సుషుమ్న క్రియా యోగ ధ్యానం, అమ్మగారి దివ్య అనుగ్రహ భాషణం కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సుషుమ్న క్రియా యోగ ద్వారా ఒక అలౌకిక ఆనందం పొందానన్నారు. తాను చదువుకునే రోజుల్లో ధ్యానం అంటే తెలిసేది కాదని, ఇప్పుడు దాని ప్రాధాన్యత అర్థం అవుతున్నట్లు చెప్పారు. మనిషికి ఉండే అనేక ఒత్తిడులను దూరం చేయడం ధ్యానంతోనే సాధ్యమని, నెల్లూరు ప్రజలకు క్రియ యోగ ప్రాధాన్యతను వివరించేలా కార్యక్రమం ఏర్పాటు చేసిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆత్మానందమయి అమ్మవారి పాదస్పర్శతో ఈ నేల పావన అయినట్లు చెప్పారు. ఇలాంటి కార్యక్రమానికి వేదిక అవడం మా అదృష్టమని పేర్కొన్నారు. ప్రజలు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని క్రియాయోగ విశిష్టతను తెలుసుకోవాలని ఆకాంక్షించారు. మానసిక ఒత్తిడిని జయించాలంటే ధ్యానమే ప్రత్యామ్నాయం. నేటి ఆధునిక జీవన శైలికి పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరి స్థాయిలో వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శ్రీ ఆత్మానందమయి అమ్మవారి అమృత వాక్కుల ద్వారా ధ్యానం యొక్క విశిష్టత గురించి తెలుసుకునే కార్యక్రమానికి హాజరవడం అదృష్టంగా అభివర్ణించారు. సెల్ ఫోన్లు, సోషల్ మీడియా మాయలో పడి పిల్లలు సాంప్రదాయాలకు తిలోదకాలిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిత్య జీవితంలో ఎదుర్కొనే స్ట్రెస్ నుంచి విముక్తి పొందాలంటే ధ్యానం ఒక్కటే ఏకైక ప్రత్యామ్నాయం అన్నారు. శ్రీ ఆత్మానందమయి అమ్మవారి ధ్యానం మరియు సాత్విక జీవన విధానం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. సమాజంలో శాంతి, సహనం సామరస్యం పెరగాలంటే ప్రతి మనిషి జీవితంలో ధ్యానం మరియు యోగాను ఒక భాగం చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ అధినేత కె ఐ వరప్రసాద్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మ










**కోవూరు, (రాజధాని వార్తలు):** పవిత్ర కార్తీక మాసం సందర్భంగా కోవూరు శాసన సభ్యురాలు, టిటిడి బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శ్రీశైల భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున స్వామివారిని దర్శించుకున్న ఆమె.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీసులు అందుకున్నారు. బంగారు రథానికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో దీపాన్ని వెలిగిం చారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటి మేయర్ రూప్ కుమార్ యాదవ్, టిడిపి నాయకులు అడపాల శ్రీధర్ రెడ్డి మరియు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# భక్తులు తరలి వచ్చి కార్తీక మాస లక్ష దీపోత్సవాన్ని విజయవంతం చేయండి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఈ నెల 6, 7, 8 తేదీల్లో నగరంలోని విఆర్సీ మైదానంలో జరిగే కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు కోరారు. ఈ మేరకు మంగళవారం వి ఆర్ సి మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఇప్పటి వరకు 80 -85 శాతం పనులు పూర్తయ్యాయనీ, చివరిదశ పనులు మాత్రమే మిగిలాయన్నారు. యాగశాల, మెయిన్ స్టేజీ, నమూనా ఆలయాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. 5వ తేదీ కల్లా అన్ని పనులు పూర్తి చేసేలా లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు పనిచేస్తున్నారని చెప్పారు. కార్తీక మాసంలో వెలిగించే దీపాలు మన జీవితాల్లో చీకట్లను తొలగిస్తాయని,కార్తీకమాసం ఫలాలను ప్రజలందరికీ చేర్చాలి అన్న ఒక మంచి ఉద్దే శంతో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నా మని వెల్లడించారు. భక్తులు మహాశివుడికి అభిషేకం చేసుకునేలా అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. భక్తులు ఒక ఆధ్యాత్మిక సంతృ ప్తితో ఇక్కడ కార్తీక దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శనం చేసుకుని వెళ్లాలన్నదే తమ ఆకాంక్ష అని కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భగవంతుడి ఆశీస్సులు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోడూరు కమలాకర్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, బెజవాడ వంశీ రెడ్డి, వీరేంద్ర నాయుడు, కార్తీక మాస లక్ష దీపోత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వి ఎస్ యూలో "తెలుగు భాష పరిరక్షణ - పరిశోధన - పరివ్యాప్తి"పై జాతీయ సదస్సు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) వేదికగా "తెలుగు భాష పరిరక్షణ - పరిశోధన - పరివ్యాప్తి" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరగనుంది. నవంబర్ 5, 6 తేదీలలో జరగనున్న ఈ సదస్సును వీఎస్‌యూ, నెల్లూరు మరియు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని సదస్సు కన్వీనర్ డాక్టర్ చిన్నం రాజారామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు సంచాలకులుగా ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ వ్యవహరించనున్నారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, విశిష్ట అతిథిగా ఏపీ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య సారంగం విజయభాస్కర రావు హాజరుకానున్నారు. గౌరవ అతిథిగా వర్సిటీ ఇంచార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రత్యేక అతిథిగా ఆచార్య సిహెచ్ విజయ, ఆత్మీయ అతిథిగా తెలుగు విభాగాధిపతి డాక్టర్ మైల త్యాగరాజు పాల్గొంటారని డాక్టర్ రాజారామ్ వివరించారు. సదస్సులో భాగంగా డాక్టర్ మేడసాని మోహన్, డాక్టర్ జీవీ పూర్ణ చందు కీలక ఉపన్యాసాలు చేయనున్నారు. కో-కన్వీనర్‌గా తెలిదేవులపల్లి విమల వ్యవహరిస్తున్నారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో పరిశోధకులు, ఆచార్యులు హాజరై తెలుగు భాషా పరిరక్షణ, పరిశోధనలపై తమ పత్రాలను సమర్పిస్తారని ఆయన పేర్కొన్నారు.

# సంపాదకీయం

## జేపీ లోహియా ప్రభావం కోల్పోని బిహార్

ఒకరు తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని అక్బర్ పూర్‌కు చెందిన బనియా. మరొకరు తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్‌ల మధ్య ఉండే సితాబ్దియారాకు చెందిన కాయస్తుడు. ఇద్దరూ 20వ శతాబ్ది ప్రథమార్థంలో విదేశాలకు వెళ్లి చదువుకున్నారు. తిరిగి వచ్చి కాంగ్రెస్ గొడుగు క్రింద స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. జహహర్ లాల్ నెహ్రూ శిష్యులుగా కాంగ్రెస్‌లోని సోషలిస్టు శిబిరంలో కొనసాగారు. ఇరువురూ తర్వాత నెహ్రూకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఒకరు రామ్ మనోహర్ లోహియా, మరొకరు జయప్రకాశ్ నారాయణ్. లోహియా జర్మనీలో చదువుకున్నారు. అమెరికాలోనూ, యూరప్‌లోనూ జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయ అధికారం, పాలనలో 60 శాతం వాటా కావాలని ఆయన అప్పుడే ప్రతిపాదించారు. పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించారు. మార్క్సిజమూ ఆయనకు నచ్చలేదు. దేశీయ సోషలిజాన్ని అన్వయించుకుని సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం పోరాడారు. ప్రభుత్వాలు ప్రజలకు పాలకులుగా కాకుండా సేవకులుగా ఉండాలన్నారు. అధికార వికేంద్రీకరణ కోరుకున్నారు. ఇంగ్లీషును సామ్రాజ్యవాద భాషగా అభివర్ణించారు. గోవా విముక్తికై పోరాడి అరెస్టయ్యారు. సోషలిస్టు పార్టీ సభ్యుడిగా లోక్‌సభలో రైతుల సమస్యలపై గళమెత్తారు. కోట్లాది భారతీయులు కేవలం మూడణాల ఆదాయంపై జీవిస్తున్నారని ఎలుగెత్తారు. ఆయన కృషి వల్లే 1967లో ఏడు ఉత్తరాది రాష్ట్రాల్లో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. జయప్రకాశ్ నారాయణ్ ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేశారు. మార్క్స్, ఎంగెల్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేసి కమ్యూనిస్టుగా మారారు. భార్య ప్రభావతి ప్రభావంతో గాంధేయవాదిగా మారి కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాలు పంచుకున్నారు. 1970లలో పోటెత్తిన కాంగ్రెస్ వ్యతిరేక ప్రభంజనంలో ఆయన కాంగ్రెసేతర శక్తులన్నిటికీ నాయకుడుగా మారి సంపూర్ణ విప్లవానికి పిలుపునిచ్చారు. ఎమర్జెన్సీ అనంతరం తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆయన ఉద్యమ స్ఫూర్తి వల్లే సాధ్యమయింది. లోహియా, జయప్రకాశ్ ఇరువురూ అధికారానికి వెంపర్లాడలేదు. ఎన్నడూ ఏ మంత్రి పదవినీ ఆశించలేదు. సోషలిస్టు సమాజ స్వప్నం నెరవేరకుండానే లోహియా 1967లో మరణించారు. తాను కారకుడైన కాంగ్రెసేతర జనతా ప్రభుత్వం అధికార కుమ్ములాటల్లో కుప్పకూలిపోతుంటే జయప్రకాశ్ విషాదగ్రస్తుడై మరణించారు. బిహార్‌లోనూ, ఉత్తరప్రదేశ్‌లోనూ ఇవాళ వెనుకబడిన వర్గాల ప్రాబల్యం విస్మరించలేని స్థానంలో ఉండేందుకు లోహియా, జేపీ నిర్మించిన పునాదులే కారణం. లాలూప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్ ఆ మహానాయకుల ప్రభావంతో ఎదిగిన వారే. ఆ ఇరువురు లోహియా స్కూలులో చదువుకుని జేపీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ పొందారని సంకర్షణ్ ఠాకూర్ అనే సీనియర్ జర్నలిస్టు 'బ్రదర్స్ బిహారీ' అనే పుస్తకంలో రాశారు. దేశ రాజకీయాల్లో లాలూ, నితీశ్ నిర్వహించిన పాత్ర తక్కువేమీ కాదు. బిహార్‌లో కాంగ్రెస్‌ను దెబ్బతీసే క్రమంలో ఇరువురూ కీలకపాత్ర పోషించారు. జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వాలు తమ మద్దతు లేకుండా ఏర్పడని పరిస్థితి కల్పించారు. లాలూతో విభేదాల వల్ల నితీశ్ వేరుపడి బీజేపీతో చేతులు కలిపినప్పటికీ ఇరువురూ బిహార్ రాజకీయాల్లో ఇప్పటికీ తమ ప్రాబల్యం కోల్పోలేదు. భారతీయ జనతా పార్టీ ఇవాళ కేంద్రంలో నితీశ్ మద్దతుపై ఆధారపడి కొనసాగుతుండడమే కాక బిహార్‌లో ఆయన లేకుండా పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. నితీశ్ తన మనుగడ కోసం బిహార్‌లో బీజేపీ ప్రవేశానికి చేయూతనిస్తే, లాలూప్రసాద్ యాదవ్ బిహార్‌లో ఆ పార్టీ ప్రవేశాన్ని, ప్రభావాన్నీ అడ్డుకునేందుకు తీవ్ర యత్నం చేశారు. కేంద్రంలో పది సంవత్సరాలు యూపీఏ ప్రభుత్వం కొనసాగేందుకు దోహదం చేశారు. ఇప్పుడు తన కుమారుడు తేజస్వి వెనుక ఒక కొండలా నిలుచున్న లాలూ ప్రభావాన్ని తక్కువ అంచనా వేసేందుకు వీలు లేదు. ఒక రకంగా చెప్పాలంటే లాలూ, నితీశ్ ఇద్దరూ బిహార్‌లో వెనుకబడిన వర్గాలు రాజకీయ ప్రాభవం కోల్పోకుండా, జాతీయ పార్టీలు తమ మీద ఆధారపడి ఉండేందుకు కారణమవుతున్నారు. అంతే కాదు, ఎన్నికల అనంతరం ఆర్‌జేడీ, జేడీ(యు) చేతులు కలిపితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిన పరిస్థితి దాదాపు ప్రతి ఎన్నికల ఫలితాల అనంతరం కనపడుతుంది. ఆ రకంగా లోహియా, జేపీల వారసత్వాన్ని కొనసాగిస్తున్నట్లేనని అర్థమవుతోంది. నిజానికి వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే నితీశ్‌ను గుర్తించి ఆయనను ముఖ్యమంత్రిగా చేసేందుకు వీలు కల్పించారు. ఆ పరిస్థితి లాలూకు వీపీ సింగ్ హయాంలోనే లభించింది. 29వ ఏట లోక్‌సభ సభ్యుడైన అయిన లాలూ 42 సంవత్సరాల వయస్సులో ముఖ్యమంత్రి అయ్యారు. ఈ నేపథ్యంలో 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను అర్థం చేసుకోవల్సి ఉంటుంది. నితీశ్, లాలూ పార్టీలు తమ ప్రాధాన్యాన్ని అదే విధంగా కొనసాగిస్తారా లేదా అన్నదే ఈ ఎన్నికల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. 74 సంవత్సరాల నితీశ్ సంపూర్ణ ఆరోగ్యంతో లేకపోవచ్చు గానీ, ఆయన ప్రాధాన్యం కోల్పోయిన నాయకుడు ఎంతమాత్రం కాదు. మెజారిటీ పరిశీలకులు ఆయన ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత లేదని విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు అత్యధిక సంఖ్యలో మద్దతునిస్తున్నారు. విద్యార్థినులకు సైకిల్ పంపిణీ పథకం ఆయనకు మంచి పేరు తెచ్చింది. నితీశ్ ఆరోగ్యం పట్ల ఏ వ్యతిరేక ప్రచారం జరిగినా, ఆయనను ఈ సారి బీజేపీ ముఖ్యమంత్రి చేయబోదన్న అభిప్రాయం వ్యాప్తి చెందినా అది ఆయన పట్ల సానుభూతికే దారి తీస్తున్నదని ఒక అంచనా.

# ఆర్టీసీ బస్సు ఢీకొని రిటైర్డ్ ఉపాధ్యాయుడికి గాయాలు



**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండల కేంద్రం నాలుగు రోడ్ల జంక్షన్‌లో సాలూరు నుండి మక్కువ వచ్చినటువంటి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడం వలన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆకుల తవిటి నాయుడు ఎడమ కాలు పూర్తిగా బస్సు చక్రం కింద పడి పూర్తిగా నలిగిపోయింది. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనానికి ఫోన్ చేశారు. సంఘటన స్థలానికి ఎస్ఐ వెంకటరమణ చేరుకొని క్షతగాత్రుడుని దగ్గర ఉండి 108 వాహనంలోకి ఎక్కించారు. మక్కువ పిహెచ్ తీసుకుని వెళ్లారు. అక్కడ డాక్టర్ల ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం ఒక ప్రైవేట్ హాస్పటల్‌కి తరలించారు. ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నారు.

# భాష్యం స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తిగాయాలు

**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలంలో గల ములక్కావలస గ్రామం దగ్గర నేటి ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో ములక్కాయ వలస గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ గండి జగదీష్ S/0 ఏయుగంధర్ రోడ్డు ప్రక్కన గల అయ్యప్ప స్వామి సన్నిధానం వద్ద స్వాములతో మాట్లాడుతుండగా వెనుక నుంచి వస్తున్న భాష్యం స్కూల్ బస్ ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఓవర్ టెక్ చేస్తూ డ్రైవర్ అజాగ్రత్తగా మోటార్ బైక్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో మోటార్ సైకిల్ నడుపుతున్న జగదీష్ కుడికాలు గుత్తి వద్ద గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# కిసాన్ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్‌గా మద్దిశెట్టి నియామకం

## - భారతీయ యువసేవ సంఘం నుంచి మద్దిశెట్టి సామేలు కిసాన్ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్‌గా అరుదైన అవకాశం లభించింది

**దమ్మపేట, (రాజధాని వార్తలు):** ఈ నియామకం భారతీయ యువసేవ సంఘం జాతీయ అధ్యక్షులు జి.రోషన్ గుప్తా సూచనల మేరకుజరిగింది. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలానికి చెందిన మద్దిశెట్టి కి ఈ గౌరవం దక్కడం రాష్ట్రానికి గర్వకారణం. మద్దిశెట్టి నేషనల్ ఫౌండర్ భరణి బాలకృష్ణన్, నేషనల్ ప్రెసిడెంట్ రోషన్ గుప్తా నేషనల్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ సౌరవ్ దాస్ నేషనల్ సెక్రటరీ షేక్ షావలి మరియు మిగతా కోర్ కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భారతీయ యువసేవ సంఘం ( బి వై ఎస్ ఎస్) అనేది భారత ప్రభుత్వం హెూం మంత్రిత్వ శాఖ, గృహనిర్మాణ శాఖ, ఎం ఎస్ ఎం ఈ మీ వంటి శాఖలతో అనుబంధంగా పనిచేసే జాతీయ స్థాయి సంస్థ. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సిద్ధాంతాలతో పని చేస్తూ దేశ యువతలో సేవా, జాతీయతా, వ్యవసాయ అభివృద్ధి భావాలను పెంపొందిస్తోంది.



# 16 మందిపై బైండోవర్ కేసులు



**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** బెల్ట్ షాపుల కేసుల్లో పట్టుబడిన 16 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జే.జనార్దన్ రావు విలేక రులకు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం,స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల బొండపల్లి మండలంలో బెల్టు షాపుల కేసుల్లో గతంలో పట్టుబడిన 14 మంది వ్యక్తులను, అలాగే ఇద్దరు అనుమానిత బెల్టు షాపుల నిర్వాహితులను మంగళవారం బొండపల్లి తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఎదుట హాజరు పరిచారు. వీరిలో 14 మందికి బి.ఎన్.ఎస్. ఎస్ చట్టం 129 అనుసరించి, 128 ప్రకారం ఇద్దరు వద్ద నుంచి ఒక సంవత్సరం కాల పరిమితికి రెండు లక్షల రూపాయలకు బాండులను తీసుకుని బైండ్ ఓవర్ కేసులను నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐలు పి.నరేంద్ర కుమార్, పి.శాంతిలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్. ఎం.డి. జె. భాషా, కానిస్టేబుల్ వి.అప్పారావు పాల్గొన్నారు.

# రూ.55 కోట్లతో 109 చెరువుల అభివృద్ధి - ఆర్ఆర్ఆర్ క్రింద ప్రతిపాదనలు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం ఇరిగేషన్ డివిజన్ పరిధిలోని 109 మైనర్ ఇరిగేషన్ చెరువులను సుమారు రూ.55 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తెలిపారు. చిన్నతరహా నీటిపారుదల చెరువుల అభివృద్ధిపై తమ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ (రిపేర్స్, రెస్టోరేషన్, రెన్నోవేషన్) క్రింద డివిజన్‌లో మొదటి విడత 44, రెండో విడత 49, తాజాగా మూడోవిడతలో 16 చెరువులను ప్రతిపాదించినట్లు తెలిపారు. మొత్తం ఐదు నియోజకవర్గాల్లోని 19 మండలాల్లో ఈ చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ 109 చెరువుల అభివృద్ధికి అనుమతి రాగానే, పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్.ఈ పి.అప్పలనాయుడు, ఈ.ఈ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ కవిత, డ్వామా పి.డి శారదాదేవి, ఇతర ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# జిన్నింగ్ మిల్లులు యథావిధిగా కొనసాగించాలి : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** జిన్నింగ్ మిల్లులు యథావిధిగా కొనసాగించాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యాజమాన్య ప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, సిసిఐ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 6వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ పిలుపునిచ్చిన బంద్ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిన్నింగ్ మిల్లులను బంద్ చేయ రాదని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిల్లులను యథాతథంగా కొనసాగించాలనే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 రకాల సమస్యలు లేకపోవడంతో, బంద్ అవసరం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని రైతులు వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నందున, పత్తి కొనుగోలు ప్రాసెసింగ్ ప్రక్రియలో అంతరాయం కలగకుండా అన్ని మిల్లులు నిరాటంకంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు పత్తి తేమ శాతం 12% మించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించి, పత్తి నాణ్యతను కాపాడే విధంగా సూచనలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా మార్కెట్ యార్డులలో పత్తి ఆరబెట్టడానికి తగిన సౌకర్యాలు కల్పించి, పత్తి తడివేయకుండా అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా కలెక్టర్ సూచించారు. నాణ్యమైన పత్తిని తీసుకు వచ్చి రైతులు మద్దతు ధర పొందాలని కలెక్టర్ సూచించారు. రైతులు సమయానికి పత్తిని మార్కెట్‌కు తీసుకురావడంతో పాటు, మిల్లులు నిరాటంకంగా కొనుగోలు చేయడం ద్వారా జిల్లా వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థ సజావుగా కొనసాగుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి, సిసిఐ బయ్యర్లు, జిల్లా మార్కెట్ కమిటీల కార్యదర్శులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరప బీజేపీ కొత్త ఇన్‌చార్జిగా తుమ్మలపల్లి నాని







**కరప, (రాజధాని వార్తలు):** భారతీయ జనతా పార్టీ కరప మండలానికి కొత్త ఇన్‌చార్జిగా తుమ్మలపల్లి నానిని నియమించారు. జిల్లా పార్టీ అధ్యక్షుల ఆదేశాల మేరకు మంగళవారం కరప మండల అధ్యక్షురాలు ఎర్రమనేడి పద్మావతి అధ్యక్షతన పార్టీ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుట్టా వీరప్రసాద్ గాంధీ కొత్తగా నియమితులైన ఇన్‌చార్జి నానిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణపై నేతలు, కార్యకర్తలతో చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత స్థాయిలో బలపరిచేందుకు అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో భాగంగా “ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్” కార్యక్రమం కొనసాగింది. ఈ సంద ర్భంగా కరప, వేములవాడ గ్రామాలలో కరపత్రాలు, స్టిక్కర్లు ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్టోబర్ 26 నుంచి ఇవ్వాల్సిన రేషన్ బియ్యం ఇంకా కొన్ని గ్రామాలకు అందలేదని మండల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరప ఎమ్మార్వో తుమ్మలపల్లి దుర్గాప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ మనీషా వారికి త్వరితగతిన పంపిణీ చర్యలు చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. అలాగే ప్రతి రేషన్ డీలర్ వద్ద ప్రధాన మంత్రి మోడీ చిత్రంతో ఉన్న రేషన్ బియ్యం ఫ్లెక్సీలు, కేంద్ర ప్రభుత్వం అందించిన డిస్ప్లే బోర్డులు వెంటనే ప్రదర్శించాలని కోరారు. కొత్త ఇన్‌చార్జి నాని మండల సీనియర్ నాయకులను కలుసుకుని క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుట్టా వీరప్రసాద్ గాంధీ, అప్పనపిల్లి సత్తిబాబు, మాజీ మండల అధ్యక్షుడు రెడ్డి రమేశ్వర్, నల్ల వెంకటేశ్వరరావు, పెమ్మాడి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, వీరబాబు, గోపిశెట్టి సుబ్బలక్ష్మి, జానకమ్మ, మంగయ్యమ్మ, అనపర్తి వెంకటేష్, సన్యాసిరావు తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ‘జటాధర’ ట్రైలర్ టాక్.. ఇది నిధి వేట కాదు, పిశాచి ఆట!




యంగ్ హీరో సుధీర్ బాబు తన జోనర్‌ను మార్చారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, ఈసారి ఒక సూపర్ నేచురల్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ‘జటాధర’ అనే టైటిల్‌తోనే ఆసక్తిని రేకెత్తించిన ఈ చిత్రం నుంచి, లేటెస్ట్‌గా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇది మామూలు దెయ్యాల కథలా కాకుండా, నిధి, బంధనాలు, పిశాచి చుట్టూ తిరిగే ఒక ఆసక్తి కరమైన కాన్సెప్ట్‌తో ఉండబోతున్నట్లు ట్రైలర్ స్పష్టం చేసింది. పూర్వం ధనాన్ని భూమిలో దాచి పెట్టి మంత్రాలతో బంధనాలు వేసేవారు. వాటిలో భయంకరమైనది పిశాచి బంధనం.. అనే కాన్సెప్ట్ ను బాగా హైలెట్ చేశారు. కథలో లంకె బిందెలు, వాటికి కాపలాగా ఉండే ‘ధన పిశాచి’ కీలక అంశాలుగా ఉండబోతున్నాయని అర్థమవుతోంది. ఈ ధన పిశాచిగా బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా విశ్వరూపం చూపించినట్లు తెలుస్తోంది. ఆమె లుక్స్, అగ్రెసివ్ పెర్ఫార్మెన్స్ ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఇక హీరో సుధీర్ బాబు విషయానికొస్తే, ఆయన ఒక పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ పాత్రలో కనిపిస్తున్నాడు. “మీలో ఎంతమంది దెయ్యాలు ఉన్నాయని నమ్ముతున్నారు?” అనే డైలాగ్‌కు కనిపిస్తే నమ్ముతాను అనే సమాధానంతో ఎంట్రీ ఇచ్చినా, ఆయనే ఆ పిశాచి బంధనాన్ని ఛేదించే పనిలో పడినట్లు తెలుస్తోంది. స్టైలిష్ లుక్స్‌తో పాటు, శివుని భక్తుడిగా, త్రిశూలంతో యాక్షన్ సీక్వెన్స్‌లలో కూడా సుధీర్ బాబు ఆకట్టుకున్నారు. ఒకవైపు హారర్ ఎలిమెంట్స్, మరోవైపు యాక్షన్ మధ్య ఆ పాత్ర బ్యాలెన్స్‌డ్‌గా ఉండబోతున్నట్లు ట్రైలర్ హింట్ ఇచ్చింది. ట్రైలర్‌లో విజువల్స్, గ్రాఫిక్స్ చాలా రిచ్‌గా ఉన్నాయి. ముఖ్యంగా, సోనాక్షి సిన్హాకు సంబంధించిన సూపర్ నేచురల్ ఎలిమెంట్స్, క్లైమాక్స్ ఫైట్ సీక్వెన్స్‌లను భారీ స్థాయిలో చిత్రీకరించినట్లు కనిపిస్తోంది. రాజీవ్ రాజ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ట్రైలర్‌లోని థ్రిల్లింగ్ మూడ్‌ను బాగా ఎలివేట్ చేసింది. ప్రతి ఫ్రేమ్‌కు ఆయన అందించిన సంగీతం అదిరిపోయింది. దర్శకులు వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ మేకింగ్ స్టైల్ ప్రామిసింగ్‌గా ఉంది. ఒక రెగ్యులర్ హారర్ కామెడీలా కాకుండా, ఇండియన్ మైథాలజీలోని లంకె బిందెలు, పిశాచి బంధనంలాంటి కాన్సెప్ట్‌ను తీసుకుని, దానికి గ్రాఫిక్స్‌ను జోడించి ఒక విజువల్ ఫీస్ట్‌లా సినిమాను తెరకెక్కించినట్లు అనిపిస్తోంది. దురాశ ఒక రాక్షసుడిని నిద్రలేపినప్పుడు.. అనే ట్యాగ్‌లైన్ కథలోని మెయిన్ కాన్సెప్ట్ క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. మొత్తం మీద, ‘జటాధర’ ట్రైలర్ ఒక డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ప్రామిస్ చేస్తోంది. ఇది కేవలం భయపెట్టే సినిమా మాత్రమే కాదు, అంతకుమించిన ఒక ఫాంటసీ, యాక్షన్, థ్రిల్లర్‌గా ఉండబోతోందని చెబుతున్నారు. ఇక నవంబర్ 7న విడుదల కానున్న ఈ సినిమా, ప్రేక్షకులను ఎంతవరకు మెప్పిస్తుందో, సుధీర్ బాబుకు ఈ కొత్త జానర్ ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

# పెద్ది మూవీ నుండి ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్!




గ్లోబల్ స్టార్‌గా పేరు సొంతం చేసుకుని.. ఇప్పుడు ఆ ట్యాగ్ ను కూడా తొలగించి.. తన కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు రామ్ చరణ్. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 27వ తేదీన తన కొత్త చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆ చిత్రం ఏదో కాదు పెద్ది. ఉప్పెన సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని మొదటి సినిమాతోనే 100 కోట్ల క్లబ్లో చేరిన బుచ్చిబాబు సనా ఈ చిత్రానికి దర్శకత్వం అందిస్తున్నారు.. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే ఆస్కార్ గ్రహీత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉండగా నిన్న వాట్ ఈజ్ చికిరి అంటూ ఒక పోస్టర్ రిలీజ్ చేస్తూ ఫస్ట్ సింగిల్ పై అంచనాలు పెంచేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా స్టూడియోలో ఏఆర్ రెహమాన్, బుచ్చిబాబు డిస్కషన్ చేసుకుంటున్నట్టు ఆ పోస్టర్ ను విడుదల చేశారు. అన్నట్టుగానే ఈరోజు ఆ చికిరి మీనింగ్ ఏంటో చెప్పేసి ఫస్ట్ సింగిల్ ప్రోమోని విడుదల చేశారు మేకర్స్. మరి బుచ్చిబాబు సనా చెప్పిన ఆ చికిరి అర్థం ఏమిటి? ఈ ఫస్ట్ సింగిల్ ఎప్పుడు రిలీజ్ చేయబోతున్నారు? ప్రోమో ఎలా ఉంది? అనే విషయాలు వైరల్‌గా మారుతున్నాయి. ఈ చికిరి పాటను రామ్ చరణ్, జాన్వీ కపూర్ మీద తెరకెక్కించారు. వీళ్ళిద్దరూ జంటగా నటిస్తున్న తొలి చిత్రం కూడా ఇదే కావడం గమనార్హం.. ఈ పాటకు ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించగా.. మోహిత్ చౌహన్ ఆలపించారు. ఈ పాట కోసం ఏ ఆర్ రెహమాన్, మోహిత్ మీద స్పెషల్ వీడియో కూడా షూట్ చేశారు బుచ్చిబాబు సన. ఈ స్పెషల్ వీడియోలో చికిరి గురించి అర్థం చెబుతూ.. కొండల్లో ఉంటున్న హీరో రామ్ చరణ్ తొలిసారి హీరోయిన్ జాన్వీనీ చూసే సందర్భంలో వచ్చే పాట చికిరి. ఈ పాటకు బాణీ కోసం రెహమాన్‌కు సందర్భాన్ని వివరించేటప్పుడు.. కాటుక అక్కర్లేని కళ్ళు.. ముక్కుపుడక అక్కర్లేని ముక్కు.. అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరి రా ఈ చికిరి అని చెబుతాడు.. అసలు ఆ చికిరి అంటే ఏంటి ? అని రెహమాన్ అడగగా.. వాళ్ళ ఊరిలో ఆడపిల్లలను ముద్దుగా, ప్రేమగా చికిరి అని పిలుస్తారు అని చెప్పారు. ఇక ఆ చికిరి పదం మీద రెహమాన్ పాట పాడేశారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన ప్రోమోని విడుదల చేయగా పూర్తి పాటను నవంబర్ ఏడవ తేదీన విడుదల చేయనున్నట్లు ప్రోమో చివర్లో ప్రకటించారు.. ప్రస్తుతం ఈ ప్రోమో కాస్త పాటపై అంచనాలను పెంచేసింది. ఇకపోతే ఇక్కడ రామ్ చరణ్ హుక్ స్టెప్పు కూడా ప్రేక్షకులను అలరిస్తోంది అని చెప్పవచ్చు.


# అరుంధతి రీమేక్.. ఎలా చూసినా డేంజరే!



టాలీవుడ్ సినీ హిస్టరీలో సూపర్ నేచురల్ థ్రిల్లర్ లకు కొత్త దారి చూపించిన సినిమా అరుంధతి. పునర్జన్మ కథగా తెరకెక్కిన ఈ సినిమా మాయ, మంత్రం, సెంటిమెంట్, థ్రిల్ అన్నింటినీ కలగలిపి ఆడియన్స్ ను ఆకట్టుకుంది. హార్రర్, థ్రిల్లర్, ఎమోషన్స్ అన్నింటినీ బ్యాలెన్స్ చేస్తూ వచ్చిన ఈ సినిమాకు ఇప్పటికీ ఆడియన్స్ గుండెల్లో ప్రత్యేక స్థానముంటుంది. అప్పటివరకు హీరోల సరసన రొమాంటిక్ సినిమాలు చేస్తూ వచ్చిన అనుష్కను స్టార్ హీరోయిన్‌గా మార్చింది ఆ సినిమానే. అరుంధతి సినిమా అనుష్కకు ఉత్తమ నటిగా నంది అవార్డు, ఫిల్మ్ ఫేర్ అవార్డులను కూడా తెచ్చిపెట్టింది. అప్పట్లోనే అరుంధతిలో వచ్చిన వీఎఫ్ఎక్స్ ఎంతో హాట్ టాపిక్‌గా మారడంతో పాటూ ఈ మూవీ సాధారణ ఆడియన్స్ నుంచే కాకుండా విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. అలాంటి మైథలాజికల్ థ్రిల్లర్‌ను ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేక్ చేస్తున్నారు. ప్రస్తుతం హార్రర్ సినిమాలకు మంచి ఆదరణ ఉండటంతో ఈ సినిమాను రీమేక్ చేయాలని భావించి దాన్ని పట్టాలెక్కించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే అరుంధతి లాంటి మాస్టర్ పీస్ సినిమాలను రీమేక్ చేయడానికి ఎన్నో గట్స్ కావాలి. అందులోనూ ఓ భాషలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన సినిమాను రీమేక్ చేస్తే దానికి పోలికలు పెట్టే ప్రమాదం కూడా ఉంటుంది. యథాతథంగా రీమేక్ చేస్తే సీన్ టూ సీన్ దించేశారంటారు. పోనీ కొన్ని మార్పులు చేద్దామా అంటే కథను మార్చి పాడుచేశారని అంటారు. అందుకే రీమేక్స్ ఎప్పుడైనా డేంజరే. ఆల్రెడీ ఈ మాస్టర్‌పీస్‌ను బెంగాలీలో రీమేక్ చేశారు.

అయితే ఆ రీమేక్ చూసి నార్త్ ఆడియన్సే బెంగాలీ వెర్షన్‌ను ఒరిజినల్ మూవీతో కంపేర్ చేస్తూ పలు వీడియోలతో ట్రోల్ చేశారు. అలాంటి సినిమాను ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేక్ చేయడం, అందులోనూ అనుష్క నటించిన పాత్రను శ్రీలీలతో చేయించడమంటే ఇది చాలా పెద్ద సవాలనే చెప్పాలి. టాలీవుడ్ లో వరుస ఫ్లాపులతో ఇబ్బంది పడుతున్న శ్రీలీలకు అరుంధతి రీమేక్ ఛాన్స్ సువర్ణావకాశమైనప్పటికీ ఆమె అనుష్క స్టాండర్డ్స్ ను ఏ మేరకు మ్యాచ్ చేస్తుందనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. పైగా ఈ సినిమాకు ప్రస్తుతం పెద్దగా ఫామ్ లో లేని మోహన్ రాజా దర్శకత్వం వహిస్తున్నారంటున్నారు. అన్నీ బావుండి సినిమా వర్కవుట్ అయితే బానే ఉంటుంది కానీ ఒకవేళ ఏమైనా తేడా కొట్టి రిజల్ట్ కాస్త అటూ ఇటూ అయితే అటు శ్రీలీల, ఇటు మోహన్ రాజా ఎన్నో విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాబట్టి ఎలా చూసుకున్నా శ్రీలీలకు అరుంధతి రీమేక్ డేంజరే.

# ఆ హీరోయిన్ సినిమా అంతా సైలెంట్ గానే!



బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ కి సరైన హిట్ పడి చాలా కాలమవుతోంది. మణికర్ణిక తర్వాత అమ్మడు విజయానికి దూరంగా జరిగింది. ఆ తర్వాత నటించిన సినిమాలేవి ఆశించిన ఫలితావ్వలేదు. వాటిలో కొన్ని కమర్షియల్ చిత్రాలైతే కొన్ని ప్రయోగాలగానూ కనిపిస్తున్నాయి. తలైవీ, ఎమెర్జెన్సీలాంటి చిత్రాలు వాస్తవ సంఘటనలు ఆధారంగా తెరకెక్కడంతో భారీ అంచనాల మధ్య రిలీజ్ అయ్యాయి. కానీ ఫలితాలు మాత్రం తీవ్ర నిరాశనే మిగిల్చాయి. చంద్రముఖి-2, తేజాస్‌లాంటి చిత్రాలు కూడా ఫ్లాప్ బాట పట్టినవే. దీంతో కంగన ఖాతాలో విజయం పడి ఆరేళ్లవుతుంది. ప్రస్తుతం ఎంపీగా కూడా ప్రజలకు సేవ చేస్తోన్న నేపథ్యంలో సినిమాలపై పూర్తిగా దృష్టి పెట్టలేకపోతుంది. ఆ మధ్య ఓ సైకలాజికల్ థ్రిల్లర్ సినిమా చేస్తున్నట్లు ప్రకటన వచ్చింది. ఈ ప్రకటన వచ్చి రెండేళ్ల అనంతరం ప్రాజెక్ట్ మొదలు పెడుతున్నట్లు కంగన మరో అప్ డేట్ ఇచ్చింది. తమిళ్, హిందీ రెండు భాషల్లో తెరకెక్కిస్తున్నారు. ఇందులో కంగనతో పాటు, మాధవన్ కూడా సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని కూడా విజయ్ తెరకెక్కించడం విశేషం. తలైవీతో ఫ్లాప్ ఇచ్చినా హిట్ ఇస్తాడనే నమ్మకంతో కంగన మరోసారి అవకాశం ఇచ్చింది. ఆర్. రవీంద్రన్ నిర్మిస్తున్నారు. వాస్తవానికి ఈ సినిమాను కూ ఇదే ఏడాది రిలీజ్ చేయాలని కంగన ప్లాన్ చేసింది. దానికి సంబంధించి అధికారిక ప్రకటన కూడా వచ్చింది. ఇలా ఇన్ని రకాల అప్డేట్స్ ఉన్నా? అసలు సినిమా మొదలైందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి తాజాగా. కంగన ఆ ప్రకటనలు చేసిన తర్వాత మళ్లీ సినిమాకు సంబంధించి ఎలాంటి అప్‌డేట్ లేదు. దీంతో అసలు ఈ సినిమా మొదలవ్వలేదని తాజాగా వెలుగులోకి వస్తుంది. కంగన ప్రకటనలు అన్నీ అక్కడికే పరిమితమైనట్లు కనిపిస్తోంది. సినిమాకు సంబంధించి వికీలో కూడా ఎలాంటి అప్డేట్ లేదు. మరి ఎలాంటి అప్ డేట్ లేకుండా కంగనా విదేశాల్లో సైలెంట్‌గా షూటింగ్ పూర్తి చేస్తుందా? అన్న సందేహం లేకపోలేదు. అయితే కంగన ఏ పని చేసినా మార్కెట్‌లో బోలెడంత హడావుడి కనిపిస్తుంది. ఆ పని చిన్నదైనా? పెద్దదైనా ప్రచారం మాత్రం పీక్స్‌లో ఉంటుంది.


# విపిఆర్ నేత్ర రెండవరోజు 231 మందికి కంటి పరీక్షలు

**- విపిఆర్ నేత్రకు భారీగా వస్తున్న ప్రజలు - 231 మందిలో 163 మందికి అద్దాల అందజేత**

**- బుధవారం వేంపాడు పంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉండనున్న బస్సు**








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎంతో ఉన్నత ఆశయంలో, గొప్ప సంకల్పంతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రారంభించిన విపిఆర్ నేత్ర కార్యక్రమంలో భాగంగా రెండో రోజు రామాపురం పంచాయతీలో 231 మందికి ప్రజలకు సిబ్బంది కంటి పరీక్షలు చేశారు.
ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పరీక్షలు చేయగా163 మందికి అద్దాలు అవసరం అని తేల్చి అద్దాలు అందజేశారు.
విపిఆర్ నేత్ర బస్సును బుధవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు వేంపాడు పంచాయతీలోని రామాలయం సమీపంలో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. కావున వేంపాడు పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# "కాకాణి పూజిత ఆధ్వర్యంలో ముమ్మరంగా కోటి సంతకాల సేకరణ"




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, దుగ్గుంట రాజుపాళెం గ్రామంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, వైయస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత. చంద్రబాబు ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకుంటుంది. కూటమి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను ఆపేసింది. కూటమి ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచన చేయకుండా, నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుంది. చంద్రబాబు ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేయడం తప్ప, ప్రజల సంక్షేమం గురించి ఆలోచన చేయడం లేదు. జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఊరూరా వైద్యం అందించారు. కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని, ప్రజలకు సంక్షేమాన్ని అందించిన ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం.
జగన్మోహన్ రెడ్డి తెచ్చిన మెడికల్ కళాశాల లకు అనుసంధానంగా ప్రభుత్వ ఆసుపత్రులు ఏర్పాటవుతాయి. ప్రజలు బాగుండాలి, భావితరాలకు వైద్య విద్య దక్కాలన్న జగనన్న సంకల్పానికి మనమందరం తోడుగా నిలబడాలి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను ఎండగట్టి, ప్రైవేటీకరణను ఖచ్చితంగా ఆపుతుంది. జగన్మోహన్ రెడ్డి గొప్ప ఆలోచనకు తోడుగా నిలుస్తూ, కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొని, జయప్రదం చేస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

# గర్భస్త లింగ నిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు డెకాయ్ ఆపరేషన్స్, ఆకస్మిక తనిఖీలు ఎక్కువగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మంగళవారం కలెక్టరు వారి ఛాంబర్‌లో గర్భస్త పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి పిఎన్‌డిటి),సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం (ఏ ఆర్ టి) అమలుపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాపెట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్త శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు, నిర్వాహకులపై కఠిన తీసుకునేందుకు జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్స్ మరియు ఆకస్మిక తనిఖీలు మరింత ముమ్మరంగా నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడమంటే భ్రూణ హత్యలను ప్రోత్సహించడమేనన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ సభ్యులు, ఎన్‌జివోలు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి.సుజాత, డి ఐ ఓ డాక్టర్ ఏ.ఉమామహేశ్వరి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆండాళ్ భాస్కర్, డిఎస్‌పి కె.సిహెచ్. రామారావు, డెమో కె.కనకరత్నం, ఎన్‌జివో కె.కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గర్ల్స్ హైస్కూల్లో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మండల స్థాయిలో పరీక్ష చేపట్టగా, మరుపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు పి.పావని, వి.సాయి సందీప్, డి.అంకిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విద్యార్థులు ఈనెల 23న జిల్లా స్థాయి చెకుముకి టెస్ట్‌లో పాల్గొననున్నట్లు మండల నిర్వాహకులు నారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# "ప్రతి రోజు కొనసాగుతున్న సోమిరెడ్డి అక్రమాలు"






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, యర్రబల్లి గ్రామంలో తిరిగి ప్రారంభమైన సోమిరెడ్డి అక్రమ గ్రావెల్ తవ్వకాలు. ఇప్పటికే ప్రభుత్వ భూమిని తవ్వేసిన సోమిరెడ్డి, చాటుగా కొండల మాటున బరి తెగించి మరీ, అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు. గ్రామస్తులు అడ్డుకుంటే పోలీసుల చేత బెదిరింపులు.
అక్రమ గ్రావెల్ త్రవ్వకాలవైపు కన్నెత్తి చూడని రెవిన్యూ, మైనింగ్, అటవీ శాఖ అధికారులు. పోలీసుల అండదండలతో రెచ్చిపోతున్న సోమిరెడ్డి గ్రావెల్ ముఠా. ప్రజా ఉపయోగాల పేరిట 10 ట్రిప్పులలో ఒక ట్రిప్పు మాత్రం వీధులకు తోలి, 9 ట్రిప్పులు అమ్ముకుంటున్న సోమిరెడ్డి గ్రావెల్ మాఫియా. ఇప్పటికే గ్రామమంతా గోతులమైందని పిల్లలు బయటకు వెళ్లాలన్నా, పశువులను బయటకు వదలాలన్న ఏం హాని జరుగు తుందో అని వణికిపోతున్న గ్రామస్తులు. జిల్లా కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకొని సోమిరెడ్డి అక్రమ గ్రావెల్ త్రవ్వకాలను నిరోధించాలని ప్రజల వినతి.

# నెల్లూరు నగరంలో కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన

**- నగరంలో మొదటగా లక్ష్యాన్ని పూర్తి చేసిన 52వ డివిజన్ - గడప గడపకు తిరిగి అవగాహన కల్పిస్తూ సంతకాల సేకరణ - కోటి సంతకాల నెల్లూరు నగర నియోజకవర్గంలో మొదటగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేసిన 52వ డివిజన్ ఇంచార్జ్ మహబూబ్ బాషా, వైసిపి నేతలను అభినందించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నెల్లూరు నగర నియోజకవర్గంలో మొదటగా పూర్తి చేసిన 52వ డివిజన్ ఇన్ చార్జ్ మహబూబ్ బాషాని డివిజన్ కో ఆర్డినేటర్ కందుకూరి రమేష్‌లతో పాటు పలువురు వైసిపి నేతలను వైయస్ఆర్సీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కింద పూర్తి చేసిన 2 వేల పత్రులను పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి వారు అందజేశారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన డివిజన్ నేతలు కూడా పనిచేసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో నెల్లూరు నగర నియోజకవర్గం ముందుండేలా ఉత్సాహంతో పని చేయాలని సూచించారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేద ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటారు

**- ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ నేడు నెల్లూరు నగరానికి విచ్చేశారు ఈ సందర్భంగా గిరిజన విద్యా చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పులి చెంచయ్య రాష్ట్ర గిరిజన యువజన విభాగ అధ్యక్షులు యాకసిరి లోక్ సాయి జనసేన స్టేట్ ప్రోగ్రాం కమిటీ సభ్యులు కొట్టే వెంకటేశ్వర్లు నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్ బాబు మూడో డివిజన్ జనసేన పార్టీ ఇంచార్జ్ బత్తల శ్రీకాంత్ వారిని ఆహ్వానించి మూడు నాలుగు డివిజన్ల ప్రజలను పరిచయం చేయించి యానాదులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని గురుకుల పాఠశాలలో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని ఐటీడీఏ నిధులను మంజూరు చేసి అభివృద్ధి పరచాలని వారి సమస్యలను తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ఎప్పుడు పేదలకు అండగా ఉంటుందని బత్తల శ్రీకాంత్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారిని ఆదర్శంగా తీసుకొని పేద ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాడని మంచి భవిష్యత్తు ఉంటుందని స్థానిక ప్రజలు తెలియజేసిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎం ఎస్ ఎం ఈ చైర్మన్ తమ్మి రెడ్డి శివశంకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మామిడాల మధు పాల్గొన్నారు.

# "దళితులు గళం విప్పితే గొంతులు కోసేస్తారా!'

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ మంత్రి మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని అపోలో ఆసుపత్రిలో తెలుగుదేశం నాయకుల గుండాల చేతిలో విచక్షణరహిత దాడిలో గాయపడి, ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రెటరీ బదనాపురి గోపాల్‌ను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్ బాబు, పలు ఎస్టీ సంఘాల నాయకులు. వైసిపి ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్ బాబు మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో తెలుగు దేశం గుండాల చేతిలో తీవ్రంగా దాడికి గురై, ప్రాణాపాయ స్థితిలో చికిత్స తీసుకుంటున్న గోపాల్‌ను పరామర్శించి, వారి కుటుంబానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించాం. అదృష్టవశాత్తు గోపాల్ ప్రాణాపాయం నుండి తప్పించుకున్నా, ఆరోగ్యం సాధారణ స్థితిలోకి ఇంకా రాలేదు. గోపాల్‌ను చంపాలనే ఉద్దేశంతోనే తెలుగుదేశం గూండాలు హత్యాయత్నం చేశారు. గోపాల్ సమాజంపై బాధ్యత కలిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎస్టీ వర్గానికి రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగిన వ్యక్తి. సోమిరెడ్డి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, చేస్తున్న రాజకీయాలకు వ్యతిరేకంగా గళం విప్పిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ వర్గానికి చెందిన కార్యకర్త గోపాల్. చంద్రబాబు ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు మాట్లాడే హక్కు లేదా!





కూటమి పార్టీ నేతలే మాట్లాడాలా! ఎస్సీ, ఎస్టీలు మాట్లాడితే గొంతులు కోస్తారా! ఇళ్లపై దాడులు చేస్తారా! చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేస్తే, మేము మాట్లాడుకుండా ఉంటాం. చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ కాలనీలలో సరైన మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వపు రాజకీయమంతా పోలీసులను ఉపయోగించి అక్రమ కేసులు పెట్టడం జైళ్లుకి పంపడం, ఎస్సీ, ఎస్టీ, మాల, మాదిగలపై దాడులు చేయించడమే. కూటమి ప్రభుత్వం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన బెట్టి రాజ్యాంగాన్ని అమలు చేస్తుంది. ప్రశ్నించే ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేయడం, గొంతులు కోయడం, తప్పుడు కేసులు పెడుతున్నారు. సోమిరెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే, వెంకటాచలం సర్పంచ్ రీ కాలింగ్ ఎన్నికకు సిద్ధపడి, గోవర్ధన్ రెడ్డి ఛాలెంజ్‌ను స్వీకరించాలి. సోమిరెడ్డి తాను అవినీతికి పాల్పడలేదని, డబ్బులు వసూలు చేయలేదని దేవుని ఎదుట ప్రమాణానికి సిద్ధమా! ప్రజాక్షేత్రంలో ప్రజల తీర్పు కోరుదాం. వెంకటాచలం సర్పంచ్ అక్రమ తొలగింపు విషయంలో న్యాయస్థానానికి వెళ్తాం. సోమిరెడ్డి నిజమైన నాయకుడు అయితే ఇప్పటికి ఇప్పుడు స్వచ్ఛందంగా శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి. ఎవరికి ఎంత ప్రజాదరణ ఉందో బయటపడుతుంది. గొంతులు కోసినా, జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునేంతవరకు వైయస్సార్ శ్రేణులు మీ దాడులను ధైర్యంగా ఎదుర్కొంటారు. మీ తాటాకు చప్పులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భయపడదు. గోపాల్‌కు, అతని కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న గోవర్ధన్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మాజీ మంత్రి కాకాణి మీడియాతో మాట్లాడుతూ గోపాల్‌పై జరిగిన హత్యాయత్నం దాడి నెల్లూరు జిల్లా ప్రజలందరినీ కలచి వేసింది. ఎస్టీ వర్గానికి చెందిన బదనాపురి గోపాల్ దంపతులపై దాడి చేసి, గొంతు కోయడానికి ప్రయత్నించడం దారుణం. గోపాల్‌కు సర్జరీ జరిగి ధైర్యంగా ఉన్నాడు. దాడి జరిగి రెండు రోజులు కావస్తున్నా, గోపాల్ పై దాడి చేసిన వారిపై మొక్కుబడిగా కేసులు పెట్టి వదిలేశారు తప్ప, పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గోపాల్‌పై దాడి చేసిన దోషులను పట్టుకొని, శిక్షించాలనే ఆలోచన పోలీసులు చేయకపోవడం దురదృష్టకరం. దాడులు చేసిన వారు ధైర్యంగా బయట తిరుగుతున్నారు. అధికార పార్టీకి, ఎవరిపైనైనా దాడి చేసి, బయట స్వేచ్ఛగా తిరగవచ్చనే సంకేతాలు పోలీసులు ఇస్తున్నారు. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి, దోషులపై కఠిన చర్యలు తీసుకొని, నెల్లూరు జిల్లాలో శాంతిభద్రతలను కాపాడాలని కోరుతున్నాం. ఎస్సీ ఎస్టీలకు రాష్ట్రంలో ఎక్కడ అన్యాయం జరిగిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో నెల్లూరు విచ్చేసి గోపాల్ కుటుంబానికి ధైర్యం కల్పించిన టీజేఆర్ సుధాకర్ బాబుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

# "కాకాణి రాకతో పోటెత్తిన జనం"





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, ముత్తుకూరు మండలం, బ్రహ్మదేవం గ్రామంలో ముత్తుకూరు మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, వైయస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ వైసిపి పరిశీలకులు పెర్నాటి కోటేశ్వర రెడ్డితో కలిసి పాల్గొన్న మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. సర్వేపల్లి నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలకు జనహోరు పోటేత్తుతున్నారు. చంద్రబాబు మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ చేయడం ఒక దుర్మార్గపు నిర్ణయం. పేదలకు వైద్య విద్యతో పాటు, కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చంద్రబాబు దూరం చేస్తున్నాడు. జగన్మోహన్ రెడ్డి గవర్నర్‌కి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి పుంకాను పుంకాలుగా జనం పాల్గొన్నడంతో భారీ స్పందన లభిస్తుంది. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జన జాతరను తలపిస్తుంది. ప్రజలు చంద్రబాబు ప్రభుత్వంపై ఉన్న ఆవేశం, జగన్మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానాన్ని వెల్లిబుచ్చుతున్నారు. చంద్రబాబు ప్రజలకు అనేక రకాలైన హామీ ఇచ్చి మోసం చేశాడు. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిల బెట్టుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వాన్ని అంతమొందించి, జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలు ఆలోచనకు వచ్చేశారు. ముత్తుకూరు మండలంలోని ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టాం. ఏపీ జెన్కోలో ఉద్యోగాలతో పాటు, గ్రామాలలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లాంటి అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు మేలు చేశాం. ముత్తుకూరు మండలంలోని ప్రతి గ్రామంలో నాన్ ఫిషర్ మెన్ ప్యాకేజీ అందించాం. సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకు సర్వేపల్లి నియోజకవర్గంలోని ఇసుక, గ్రావెల్, మట్టి, బూడిద అమ్ముకుంటున్నారు. బూడిద తరలించే ఒక్కో బంకర్ నుండి 300 రూపాయలు చొప్పున అక్రమ వసూళ్లకు సోమిరెడ్డి ముఠా పాల్పడుతుంది. గొలగమూడిలో సంతను ఏర్పాటు చేసి, సోమిరెడ్డి కొడుకు నెలకు 5 లక్షల రూపాయలు దండుకుంటున్నాడు. సోమిరెడ్డికి దండకాలు, పంపకాల్లో తప్ప, సర్వేపల్లి అభివృద్ధి పై ధ్యాసే లేదు. కూటమి ప్రభుత్వం యూరియా అడిగే రైతులను పోలీసులతో భయపెడుతున్నారు. రైతులకు అవసరం మేర యూరియా ప్రభుత్వం పంపిణీ చేయాలి. తెలుగు దేశం నాయకులు రైతులు యూరియా ఇవ్వకుండా తమ ఇళ్లల్లో ఉంచుకుంటామంటే ఒప్పుకునేది లేదు. రైతుల యూరియా విషయంలో మరోసారి జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధం!. రైతుల ప్రయోజనాలే మాకు ముఖ్యం. నియోజకవర్గంలోని ప్రతి రైతుకు యూరియా అందించే బాధ్యత నాది. ఇబ్బందులకు గురి చేసే ప్రతి ఒక్కరి లెక్కలు సరిచేస్తాం, ఏ ఒకర్నీ విడిచి పెట్టేది ఉండదు. పెద్ద ఎత్తున విచ్చేసి, జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు.

# రూ.55 కోట్లతో 109 చెరువుల అభివృద్ధి - ఆర్ఆర్ఆర్ క్రింద ప్రతిపాదనలు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం ఇరిగేషన్ డివిజన్ పరిధిలోని 109 మైనర్ ఇరిగేషన్ చెరువులను సుమారు రూ. 55 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తెలిపారు. చిన్నతరహా నీటిపారుదల చెరువుల అభివృద్ధిపై తమ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో మంగళ వారం సమావేశాన్ని నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ (రిపేర్స్, రెస్టోరేషన్, రెన్నోవేషన్) క్రింద డివిజన్‌లో మొదటి విడత 44, రెండో విడత 49, తాజాగా మూడోవిడతలో 16 చెరువులను ప్రతిపాదించినట్లు తెలిపారు. మొత్తం ఐదు నియోజకవర్గాల్లోని 19 మండలాల్లో ఈ చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ 109 చెరువుల అభివృద్ధికి అనుమతి రాగానే, పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్.ఈ పి.అప్పలనాయుడు, ఈ.ఈ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ కవిత, డ్వామా పి.డి శారదాదేవి, ఇతర ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుని పాత్ర కీలకం : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుల పాత్ర మరియు వారి కృషి కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం సుజాతనగర్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, సౌకర్యాలు వంటి అంశాలను సమీక్షించారు. స్వచ్ఛత కాంపైన్ 5.0 కార్యక్రమం కింద పాఠశాలలో చేపట్టిన శుభ్రతా చర్యల గురించి ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ రోజున పాఠశాలలో ఏ ఏ పనులు చేపట్టారు అని ఉపాధ్యాయులను అడిగి, ఈ రోజున చేయవలసిన పనులు సక్రమంగా జరగకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న ప్రతి విద్యా కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల సమన్వయంతో, విద్యార్థుల భాగస్వామ్యంతో, తల్లిదండ్రుల సహకారంతో అమలు చేసినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి అనేది కేవలం భవన నిర్మాణం లేదా వసతుల పెంపు కాదు, అది ఒక సమగ్ర ప్రక్రియ. అందులో ప్రధానోపాధ్యాయుడు కీలక నాయకత్వ పాత్ర పోషించాలి. విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం ఇవన్నీ ప్రధానోపాధ్యాయుని దిశానిర్దేశంపై ఆధారపడి ఉంటాయి, అని అన్నారు. పాఠశాలలోని టాయిలెట్లను పరిశీలించిన కలెక్టర్, కొన్ని టాయిలెట్లు మూసివేసి తాళం వేసి ఉంచినట్లు గమనించి అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం అందుబాటులో ఉన్న వసతులను వినియోగించకపోవడం నిర్లక్ష్యమని పేర్కొని, వెంటనే టాయిలెట్లను తెరిచి మరమ్మతులు పూర్తి చేయాలని పాఠశాల మేనేజ్మెంట్ గ్రాంట్ ద్వారా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్రాగునీటి సౌకర్యం తగిన విధంగా లేని విషయం గమనించిన కలెక్టర్, పాఠశాలలో కొత్త బోర్ వేయడం కోసం తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని విద్యా శాఖాధికారి మరియు మిషన్ భగీరథ ఈ ఈ కు ఆదేశించారు. విద్యార్థులకు నిరంతరంగా శుద్ధమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పీఎం శ్రీ పాఠశాల కావడంతో, ఆటస్థల అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించి, విద్యార్థుల క్రీడా ప్రతిభను పెంపొందించే దిశగా అన్ని ఆటలకు సంబంధించిన కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతుందని, క్రమశిక్షణతో పాటు సమూహ భావన కూడా పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణం బయట నిర్మాణంలో ఉన్న భవిత కేంద్రంను కూడా ఆయన పరిశీలించారు.

భవనం చాలా లోతులో నిర్మించబడినందున వర్షపు నీరు నిలిచే ప్రమాదం ఉందని గమనించి, సరైన ఎత్తు పెంచి మిగతా నిర్మాణ పనులు కొనసాగించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. భవిత కేంద్రాలు పాఠశాలలకు విలువైన వనరుల కేంద్రాలుగా మారాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, కాబట్టి వాటి నిర్మాణం నాణ్యతతో కూడినదిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మరియు విద్యార్థుల ప్రతిభను పెంపొందించే పద్ధతులపై చర్చించారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల స్థాయిలో మార్పు తీసుకురాగలడని, వారి కృషితోనే ప్రభుత్వ పాఠశాలలు మరింత ఆదర్శవంతమైనవిగా మారుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నారాయణ గోమతి సిబిఎస్ఇ స్కూల్ - ఎస్ఎల్‌సి ప్రోగ్రాం





**గోమతి నగర్, నెల్లూరు, (రాజధాని వార్తలు):** నారాయణ గోమతి సిబిఎస్ఇ స్కూల్‌లో E-Champs సెగ్మెంట్‌కు చెందిన ప్రైమరీ క్లాసుల విద్యార్థుల కోసం SLC (Student Led Conference) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. విద్యార్థులు తల్లిదండ్రుల సమక్షంలో TLM (Teaching Learning Material)లను ప్రదర్శిస్తూ, ఫస్ట్ టర్మ్ అకడమిక్ లెసన్స్‌పై తమ నేర్చుకున్న విషయాలను వివరించారు. విద్యార్థుల రూపొందించిన TLM లు చాలా అద్భుతంగా ఉండి, వారి ప్రదర్శన అందరి మనసును ఆకట్టుకుంది. అలాగే డిజిటల్ బోర్డ్స్ ద్వారా విద్యార్థులు తమ ప్రెజెంటేషన్లను చక్కగా అందించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కోఆర్డినేటర్ వరలక్ష్మి చాలా సమర్థంగా ఫాలోఅప్ చేసి, ప్రతి టీచర్‌కి మార్గదర్శనం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధీర్ తల్లిదండ్రులు మరియు టీచర్లతో చక్కటి సమన్వయం చూపించి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం అందరూ కలసి కృషి చేయాలని సూచించారు. కార్యక్ర మంలో ఏజిఎం రవివర్మ, ఆర్ఐ ఆదిశేషయ్య, వైస్ ప్రిన్సిపాల్ సౌమ్యరెడ్డి, ఏఓ సాయిప్రసాద్ పాల్గొన్నారు. తమ పిల్లల ప్రతిభను ప్రత్యక్షంగా గమనించిన తల్లిదండ్రులు మేనేజ్‌మెంట్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుని పాత్ర కీలకం : జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్





**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుల పాత్ర మరియు వారి కృషి కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం సుజాతనగర్ జడ్.పి. హెచ్.ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, సౌకర్యాలు వంటి అంశాలను సమీక్షించారు. స్వచ్ఛత కాంపైన్ 5.0 కార్యక్రమం కింద పాఠశాలలో చేపట్టిన శుభ్రతా చర్యల గురించి ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ రోజున పాఠశాలలో ఏ ఏ పనులు చేపట్టారు అని ఉపాధ్యాయులను అడిగి, ఈ రోజున చేయవలసిన పనులు సక్రమంగా జరగకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వం చేపడుతున్న ప్రతి విద్యా కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల సమన్వయంతో, విద్యార్థుల భాగస్వామ్యంతో, తల్లిదండ్రుల సహకారంతో అమలు చేసినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి అనేది కేవలం భవన నిర్మాణం లేదా వసతుల పెంపు కాదు, అది ఒక సమగ్ర ప్రక్రియ. అందులో ప్రధానోపాధ్యాయుడు కీలక నాయకత్వ పాత్ర పోషించాలి. విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం ఇవన్నీ ప్రధానోపాధ్యాయుని దిశానిర్దేశంపై ఆధారపడి ఉంటాయి, అని అన్నారు. పాఠశాలలోని టాయిలెట్లను పరిశీలించిన కలెక్టర్, కొన్ని టాయిలెట్లు మూసివేసి తాళం వేసి ఉంచినట్లు గమనించి అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం అందుబాటులో ఉన్న వసతులను వినియోగించకపోవడం నిర్లక్ష్యమని పేర్కొని, వెంటనే టాయిలెట్లను తెరిచి మరమ్మతులు పూర్తి చేయాలని పాఠశాల మేనేజ్మెంట్ గ్రాంట్ ద్వారా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్రాగునీటి సౌకర్యం తగిన విధంగా లేని విషయం గమనించిన కలెక్టర్, పాఠశాలలో కొత్త బోర్ వేయడం కోసం తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని విద్యా శాఖాధికారి మరియు మిషన్ భగీరథ ఈ ఈ కు ఆదేశించారు. విద్యార్థులకు నిరంతరంగా శుద్ధమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పీఎం శ్రీ పాఠశాల కావడంతో, ఆటస్థల అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించి, విద్యార్థుల క్రీడా ప్రతిభను పెంపొందించే దిశగా అన్ని ఆటలకు సంబంధించిన కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతుందని, క్రమశిక్షణతో పాటు సమూహ భావన కూడా పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణం బయట నిర్మాణంలో ఉన్న భవిత కేంద్రంను కూడా ఆయన పరిశీలించారు.


భవనం చాలా లోతులో నిర్మించబడినందున వర్షపు నీరు నిలిచే ప్రమాదం ఉందని గమనించి, సరైన ఎత్తు పెంచి మిగతా నిర్మాణ పనులు కొనసాగించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. భవిత కేంద్రాలు పాఠశాలలకు విలువైన వనరుల కేంద్రాలుగా మారాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, కాబట్టి వాటి నిర్మాణం నాణ్యతతో కూడినదిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మరియు విద్యార్థుల ప్రతిభను పెంపొందించే పద్ధతులపై చర్చించారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల స్థాయిలో మార్పు తీసుకురాగలడని, వారి కృషితోనే ప్రభుత్వ పాఠశాలలు మరింత ఆదర్శవంతమైనవిగా మారుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# "కోటి సంతకాల సేకరణ"లో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య





**గజపతినగరం/ గంట్యాడ, (రాజధాని వార్తలు):** నియోజకవర్గం లోని గంట్యాడ మండలంలో గల రామవరం, కొర్లం గ్రామాల్లో వైకాపా సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య ఆధ్వర్యంలో మంగళవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బొత్స రెండు గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం ద్వారా గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు . ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసు కున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే బొత్స అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీ కరణతో వైద్యవిద్య పేద, మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షే అవుతుందని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ పీరుబండి హైమావతి, జడ్పిటిసి వర్రీ నరసింహమూర్తి, వైకాపా



జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న కుశాల్

**అమలాపురం, (రాజధాని వార్తలు):** తన మేదస్సుతో మూడవ తరగతి చదువుతున్న విత్తనాల కుషాల్ నాగ వెంకట్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. కాట్రేనికోన గ్రామానికి చెందిన విద్యార్థి కుశాల్ నాగ వెంకట్ కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు.కుశాల్ ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ చిన్నారి 195 దేశాల పేర్లు వాటి రాజధానుల పేర్లు కేవలం 2 నిమిషాల 59 సెకన్ల 11 మిల్లి సెకన్‌ల కాలవ్య వధిలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుని సర్టిఫికెట్ అందుకున్నాడు.కలెక్టరేట్ లో మంగళవారం కలెక్టర్ మహేష్ కుమార్ విద్యార్థి కుశాల్‌తో పాటు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులను అభినందించి అవార్డును బహుకరించారు. కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖఅధికారి షేక్ సలీం భాషా, డైరెక్టర్ నంద్యాల మనోవిహార్, పాఠశాల కోఆర్డి నేటర్ వర్ధిని, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan